JORDAR NEWS
విన్న అవినీతి అంతం - అదే మా పంతం
జోర్దార్
తెలంగాణ & ఆంధ్రప్రదేశ్
రెండు తెలుగు రాష్ట్రాల్లో ఖాళీగా ఉన్న మండలాలు, నియోజకవర్గాలు, జిల్లాల్లో జోర్దార్ దినపత్రికలో పనిచేయుటకు మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయి స్టాఫ్ రిపోర్టర్లు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి.
9848811424

RNI NO.TGTEL/25/A5224
జోర్దార్
JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక
అవినీతి అంతం - మా పంతం

JORDAR NEWS
విన్న అవినీతి అంతం - అదే మా పంతం
జోర్దార్
తెలంగాణ & ఆంధ్రప్రదేశ్
రెండు తెలుగు రాష్ట్రాల్లో ఖాళీగా ఉన్న మండలాలు, నియోజకవర్గాలు, జిల్లాల్లో జోర్దార్ దినపత్రికలో పనిచేయుటకు మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయి స్టాఫ్ రిపోర్టర్లు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి.
9848811424

కరీంనగర్ సంపుటి : 01 సంచిక : 277 ఆదివారం, అక్టోబర్ 25 2026, పేజీలు - 8 వెల : 2/- epaper.jordar.com

# ఇంక్రిమెంట్లలో ఇష్టారాజ్యం.. 500 మందికి అనర్హ లబ్ధి!

- ప్రొబేషన్ పూర్తికాకుండానే చెల్లింపులు..
- నాలుగు ఉమ్మడి జిల్లాల్లో వ్యవహారం
- ప్రభుత్వ ఖజానాకు గండి..
- అదనపు సొమ్ము రికవరీకి ఇంటర్ విద్యాశాఖ ఆదేశాలు
- ఒక్కొక్కరి నుంచి రూ.60 వేల వరకు వసూలు చేసే అవకాశం..
- బాధ్యులపై చర్యలకు కసరత్తు




**హైదరాబాద్ జోర్దార్ ప్రతినిధి**
ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో జూనియర్ లెక్చరర్లకు మంజూరైన ఇంక్రిమెంట్ల వ్యవహారం ఇప్పుడు ఇంటర్మీడియట్ విద్యాశాఖలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అర్హత, సర్వీసు నిబంధనలను పరిశీలించకుండా కొందరు ప్రిన్సిపాళ్లు వ్యవహరించడంతో అనర్హులకూ అదనపు ఆర్థిక ప్రయోజనం చేకూరినట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు సమాచారం. దీంతో ప్రభుత్వ ఖజానాకు అదనపు భారం పడినట్లు అధికారులు భావిస్తున్నారు. సాధారణంగా ప్రభుత్వ ఉద్యోగులకు ప్రొబేషన్ విజయవంతంగా పూర్తై, సంబంధిత సర్వీసు ప్రక్రియ అధికారికంగా ఖరారైన తర్వాతే నిబంధనల ప్రకారం వార్షిక ఇంక్రిమెంట్లు, ఇతర ఆర్థిక ప్రయోజనాలు వర్తిస్తాయి. అయితే సిద్దిపేట జిల్లాలోని పలు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ జూనియర్ లెక్చరర్ల విషయంలో ప్రొబేషన్ ప్రక్రియ పూర్తికాకముందే ఇంక్రిమెంట్లు మంజూరు చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. కొన్ని చోట్ల తప్పుడు లెక్కలు, సరైన అర్హతలు పరిశీలించకపోవడం వంటిఅంశాలుచోటుచేసుకున్నట్లు గుర్తించినట్లు తెలుస్తోంది.

**న్యాయస్థాన ఆదేశాలపైనా నిర్లక్ష్యం?**
కాంట్రాక్ట్ లెక్చరర్ల సర్వీసు, రెగ్యులరైజేషన్, ఆర్థిక ప్రయోజనాలకు సంబంధించి గతంలో న్యాయస్థానాల నుంచి వచ్చిన ఆదేశాలు, ప్రభుత్వ నిబంధనలు అమల్లో ఉన్నాయి. ప్రొబేషన్ వంటి ప్రక్రియలు పూర్తికాకముందు అదనపు ఆర్థిక ప్రయోజనాలు కల్పించే విషయంలో నిబంధనలు పాటించాల్సి ఉన్నప్పటికీ.. కొందరు ప్రిన్సిపాళ్లు వాటిని పట్టించుకోకుండా ఇంక్రిమెంట్లు మంజూరు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా సిద్దిపేట జిల్లా పరిధిలో ఈ అంశం అధికారుల దృష్టికి వెళ్లినట్లు సమాచారం.

**నాలుగు జిల్లాల్లో 500 మంది వరకు..**
ఈ అక్రమ ఇంక్రిమెంట్ల వ్యవహారం సిద్దిపేటకే పరిమితం కాలేదని తెలుస్తోంది. సిద్దిపేట, ఖమ్మం, నల్గొండ, మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాల పరిధిలోని సుమారు వంద ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో దాదాపు 500 మంది జూనియర్ లెక్చరర్లు నిబంధనలకు విరుద్ధంగా ఇంక్రిమెంట్ల ద్వారా అదనపు లబ్ధి పొందినట్లు ప్రాథమికంగా లెక్కలు తేల్చినట్లు సమాచారం. అయితే పూర్తిస్థాయి విచారణ అనంతరం వాస్తవ సంఖ్యపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

**రూ.60 వేల వరకు రికవరీ**
నిబంధనలకు విరుద్ధంగా చెల్లించిన ఇంక్రిమెంట్ల కారణంగా లెక్చరర్లు అదనంగా పొందిన మొత్తాన్ని తిరిగి ప్రభుత్వ ఖజానాకు జమ చేయించాలని ఇంటర్మీడియట్ విద్యాశాఖ ఆదేశించినట్లు తెలుస్తోంది. లెక్చరర్ పొందిన అదనపు లబ్ధిని బట్టి ఒక్కొక్కరి నుంచి రూ.60 వేల వరకు రికవరీ చేసే అవకాశం ఉందని అధికార వర్గాల్లో చర్చ జరుగుతోంది. సంబంధిత కళాశాలల ప్రిన్సిపాళ్లు రికవరీ ప్రక్రియను చేపట్టాల్సి ఉంటుందని సమాచారం.

**ప్రిన్సిపాళ్ల పాత్రపై విచారణ**
ఇంక్రిమెంట్ల మంజూరులో నిబంధనలను ఉల్లంఘించినట్లు తేలితే సంబంధిత ప్రిన్సిపాళ్లపై కూడా చర్యలు తీసుకునే అవకాశం ఉంది. అర్హతను పరిశీలించకుండా ఇంక్రిమెంట్లు ఎందుకు మంజూరు చేశారు? ఏ ప్రాతిపదికన లెక్కలు రూపొందించారు? ఎంత మొత్తంలో అదనపు చెల్లింపులు జరిగాయి? అనే అంశాలపై అధికారులు వివరాలు సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. మొత్తం వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి నివేదిక సమర్పించాలని జిల్లాల అధికారులను ఆదేశించినట్లు సమాచారం. విచారణ నివేదిక ఆధారంగా అక్రమ చెల్లింపులపై రికవరీతో పాటు బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకునే అవకాశం కనిపిస్తోంది.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలపై మంత్రి పొంగులేటి

# కీలక ప్రకటన



**హైదరాబాద్, అక్టోబరు 24 :**
జర్నలిస్టులకు ఇళ్లస్థలాలపై తెలం గాణ మంత్రి పొంగులేటి శ్రీనివా స్‌రెడ్డి (శనివారం) కీలక ప్రకటన చేశారు. జర్నలిస్టుల సొంతింటి కల సాకారం చేస్తామని.. వారికి ఇళ్లస్థలాలు ఇచ్చేందుకు కార్యా చరణ రూపొందిస్తున్నామని తెలిపారు. న్యాయపరమైన చిక్కు లు లేని విధంగా స్థలాలను కేటాయిస్తామని స్పష్టం చేశారు. నివాసయోగ్యమైన ప్రాంతం లో ఇళ్లస్థలాలు అందిస్తామని చెప్పుకొచ్చారు. జర్నలిస్టులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. ఇళ్లస్థలాల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని పేర్కొన్నారు.సీఎం రేవంత్‌రెడ్డితో పలుమార్లు ఈ విష యంపై చర్చించామని మంత్రి పొంగులేటి తెలిపారు. జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీ అంశంపై సమీక్షిస్తున్నామని అన్నారు. గతంలో న్యాయపరమైన చిక్కులతో స్థలాల ప్రక్రియ నిలిచిపోయిందని ప్రస్తా వించారు. 2008లో జర్నలిస్టు హౌసింగ్ సొసైటీకి భూముల కేటాయింపునకు ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. సుప్రీంకోర్టులో వేసిన పిటిషన్‌తో ఇళ్ల స్థలాల ప్రక్రియ నిలిచిపోయిందని వెల్లడించారు. 2022లో తొలగిపోయాయని చెప్పారు. 2024 సెప్టెంబర్ 8వ తేదీన జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీకి భూమి అప్పగించామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

# నిబంధనల విరుద్ధంగా ఇంక్రిమెంట్లు ఇచ్చిన ప్రిన్సిపాల్

- హనుమకొండ జిల్లా ధర్మసాగర్ లో హల్చల్
- తన తప్పేమీ లేదంటున్న ప్రిన్సిపాల్ ఆసనాల శ్రీనివాస్
- ఇంటర్ బోర్డు కమిషనర్ జర దేకో..




**హైదరాబాద్/హనుమకొండ జోర్దార్ ప్రతినిధి**
హనుమకొండ జిల్లా ధర్మసాగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకుల ఇంక్రిమెంట్ల వ్యవహారం వివాదానికి దారితీసింది. 2023లో క్రమబద్ధీకరణ పొందిన కాంట్రాక్ట్ జూనియర్ లెక్చరర్లలో సుమారు ఏడుగురికి రెండో, మూడో ఇంక్రిమెంట్లు మంజూరు చేసిన వ్యవహారంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇంటర్మీడియట్ ఉన్నత విద్యాధికారుల నుంచి స్పష్టమైన ఆదేశాలు లేకుండానే, ట్రెజరీ అధికారుల సహకారంతో ఇంక్రిమెంట్లు ఇప్పించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇంక్రిమెంట్ల అంశంపై సుప్రీంకోర్టులో స్టేటస్‌కో కొనసాగుతున్న సమయంలోనే ఈ ప్రయోజనం ఎలా కల్పించారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అంతేకాకుండా, క్రమబద్ధీకరణ అనంతరం ప్రొబేషనరీ కాలం పూర్తికాకముందే ఇంక్రిమెంట్లు మంజూరు చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంలో ముడుపులు చేతులు మారాయన్న ఆరోపణలు కూడా కొన్ని వర్గాల నుంచి వినిపిస్తున్నాయి. అయితే, ఈ ఆరోపణలకు సంబంధించి అధికారికంగా ఎలాంటి నిర్ధారణ కాలేదు. ఇంక్రిమెంట్లు మంజూరు చేసిన విషయాన్ని ప్రిన్సిపాల్ స్వయంగా సమర్థించినట్లు తెలుస్తోంది. ఇతర ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు కూడా ఇదే విధంగా వ్యవహరించాలని సూచించినట్లు సమాచారం. 2023లో క్రమబద్ధీకరణ పొందిన అధ్యాపకులు ఇంక్రిమెంట్లతో సంతోషంగా ఉన్నారని కళాశాల ప్రిన్సిపాల్ పుట్టినరోజు సందర్భంగా ప్రకటించినట్లు తెలుస్తోంది. దీంతో ఈ వ్యవహారం మరింత చర్చనీయాంశంగా మారింది.

**కార్పొరేట్ విద్యార్థుల అడ్మిషన్లపైనా ఆరోపణలు**
ఇదే కళాశాలలో 200 మందికి పైగా కార్పొరేట్ కళాశాలల విద్యార్థుల అడ్మిషన్లు కొనసాగుతున్నాయన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఒక్కో అడ్మిషన్‌కు సుమారు రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు వసూలు చేస్తున్నారని పలు సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఈ అంశంపైనా అధికారులు సమగ్రంగా విచారణ చేపట్టాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

**'నిబంధనల ప్రకారమే ఇచ్చాం': ప్రిన్సిపాల్**
ఇంక్రిమెంట్లపై ధర్మసాగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అస్మాల శ్రీనివాస్ వివరణ ఇస్తూ 2023లో కాంట్రాక్ట్ జూనియర్ లెక్చరర్లు క్రమబద్ధీకరణ పొందిన తర్వాత సుమారు రెండేళ్లకు ఇంక్రిమెంట్లు మంజూరు చేశామని తెలిపారు. నిబంధనల ప్రకారమే ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. సుప్రీంకోర్టులో ఇంక్రిమెంట్లు ఇవ్వకూడదన్న స్టేటస్‌కో ఉన్న విషయం తమకు తెలుసని, అయినప్పటికీ కొన్ని అనివార్య పరిస్థితుల నేపథ్యంలో ఇంక్రిమెంట్లు ఇచ్చామని వివరించారు. ప్రభుత్వం రెండేళ్ల ప్రొబేషనరీ కాలాన్ని ప్రకటించాల్సి ఉన్నప్పటికీ, ఆ ప్రక్రియలో ఆలస్యం జరిగిందని, అందువల్లే ఈ నిర్ణయం తీసుకున్నామని ప్రిన్సిపాల్ తెలిపారు. అయితే ఉన్నతాధికారుల అనుమతి తీసుకున్నారా? స్టేటస్‌కో ఉన్న సమయంలో ఇంక్రిమెంట్లు మంజూరు చేయడానికి ఏ నిబంధన ఆధారంగా నిర్ణయం తీసుకున్నారు? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. ఆరోపణలు, ప్రిన్సిపాల్ వివరణల నేపథ్యంలో ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపితేనే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

సిద్దిపేటలో దారుణం బాలికపై

# సామూహిక అత్యాచారం

## ఏడుగురి అరెస్ట్



తెలంగాణలోని సిద్దిపేట జిల్లాలో అత్యంత దారుణమైన ఘటన చోటుచేసుకుంది. 15 ఏళ్ల బాలికపై ఏడుగురు వ్యక్తులు సామూ హిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ ఘ టనకు సంబంధించి ముగ్గురు మైనర్లు సహా నిందితులందరినీ పోలీసులు అరెస్ట్ చేశారు. వారిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పోలీసుల కథనం ప్రకారం.. దసరా పండుగ రోజున బాలిక తల్లిదండ్రులు పొలం పనులకు వెళ్లారు. ఇంట్లో ఒంటరిగా ఉన్న బాలికను గమనించిన నిందితులు, ఆమెను కిడ్నాప్ చేసి సమీపంలోని మరో గ్రామానికి తీసుకెళ్లారు. అక్కడ ఆమెపై సామూహిక అత్యాచారానికి ఒడిగట్టారు. మరుసటి రోజు ఉదయం బాధితురాలిని ఆమె గ్రామ సమీపంలో వదిలిపెట్టి వెళ్లిపోయారు. ఇంటికి చేరుకున్న బాలిక జరిగిన దారుణాన్ని తల్లిదండ్రులకు వివరించడంతో, వారు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందుకున్న వెంటనే పోలీసులు రంగంలోకి దిగారు. మద్దూరు ఎస్సై ఎండి.ఆసిఫ్ తెలిపిన వివరాల ప్రకారం, నిందితులు చెరియాల్ పట్టణం, ధూల్‌మిట్ట గ్రామానికి చెందినవారిగా గుర్తించారు. ఏడుగురినీ అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపర్చగా, న్యాయస్థానం వారికి జ్యుడీషియల్ కస్టడీ విధించింది. నిందితులకు డ్రగ్స్ పరీక్షలు నిర్వహించగా, వారు మాదకద్రవ్యాలు సేవించిన ఆనవాళ్లు కనిపించలేదని పోలీసులు స్పష్టం చేశారు. చట్ట ప్రకారం బాధితురాలు, నిందితుల్లోని మైనర్ల వివరాలను గోప్యంగా ఉంచారు. ఈ ఘటనపై కేసు నమోదు లోతుగా దర్యాప్తు జరుపుతున్నారు.

మత్తు మందుల అక్రమ విక్రయాలపై

# టీజీ సేఫ్ కొరడా

**హైదరాబాద్, అక్టోబరు 24 :** తెలంగాణలో మత్తు మందుల అక్రమ విక్రయాలపై టీజీ సేఫ్ కొరడా ఝుళిపించింది. హైదరాబాద్ క్యూర్ పరిధిలో పలు ప్రాంతాల్లో మెడికల్ షాపులపై అధికారులు (శనివారం) మెరుపు దాడులు నిర్వహించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులతో కలిసి డ్రగ్స్ వింగ్ అధికారులు తనిఖీలు చేపట్టారు. గాజులరామారం, కుత్బుల్లాపూర్, మల్కాజిగిరి, కాప్రా, హబ్సిగూడ, ఉప్పల్‌లో సోదాలు చేశారు. జీడిమెట్ల, బాలానగర్, మేడిపల్లి, షామీర్‌పేట్ జోన్లలోనూ రైడ్స్ నిర్వహించారు.ఈ నేపథ్యంలో హానికరమైన మాత్రల విక్రయాలపై అధికారులు నిఘాపెట్టారు. పలు రకాల మందులపై తనిఖీలు చేపట్టారు. ఆయా మందుల అక్రమ విక్రయాలపై ఆరా తీశారు. ఈ సోదాల్లో నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడిన 125 మెడికల్ షాపులను అధికారులు గుర్తించారు. సంబంధిత మెడికల్ షాపులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. లైసెన్సుల సస్పెన్షన్ లేదా రద్దుకు శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తెలంగాణలోని ఇతర జిల్లాల్లోనూ ప్రత్యేక తనిఖీలు కొనసాగుతున్నాయని అధికారులు పేర్కొన్నారు.

## 'పాడి పంటలు' మాసపత్రిక విడుదలలో

# తీవ్ర జాప్యం




- అక్టోబర్ చివరి వారమైనా ప్రభుత్వ వెబ్‌సైట్‌లో అందుబాటులోకి రాని పత్రిక
- సకాలంలో రైతులకు అందుబాటులో ఉంచాలని రైతు సంఘాల డిమాండ్

**(జోర్దార్ హైదరాబాద్ అగ్రికల్చర్ బ్యూరో చీఫ్)**రైతులకు వ్యవసాయం, పాడి పరిశ్రమకు సంబంధించిన సమాచారాన్ని అందించాల్సిన 'పాడి పంటలు' మాసపత్రిక విడుదలలో తీవ్ర జాప్యం జరుగుతోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అక్టోబర్ నెల చివరి వారానికి చేరుకున్నప్పటికీ, సంబంధిత ప్రభుత్వ వెబ్‌సైట్‌లో పత్రిక అందుబాటులోకి రాకపోవడంపై రైతులు, రైతు సంఘాలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి.
రైతులకు అవసరమైన వ్యవసాయ సూచనలు, పాడి పశువుల సంరక్షణ, ఆధునిక సాగు పద్ధతులు, ప్రభుత్వ పథకాల సమాచారాన్ని సకాలంలో అందించేందుకు మాసపత్రికను క్రమం తప్పకుండా విడుదల చేయాలని రైతు సంఘాలు కోరుతున్నాయి. పత్రిక విడుదలలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని, ప్రతి నెలా నిర్ణీత సమయంలో ప్రభుత్వ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేస్తున్నాయి.

# పోషకాల ఘని..సీతా ఫలం

పేదోడికి అందుబాటులో ఉండి, ఉత్తమ పోషక విలువలు కలిగిన ఫలం సీతాఫలం. దీన్ని పేదోడి యాపిల్ అని కూడా పేరొచ్చింది. పల్లెటూరి మధురఫలం సీతాఫలం. ప్రతి సీతా కాలంలో ఈ ఫలాలు లభిస్తాయి. నిరుపేద కుటుంబాల జీవనాధారం అయితే... పేదోడి నోటికి తియ్యటి ఫలహారం అవుతోంది. ఎన్నో పోషక విలువలు, ఎన్నో ఔషధ గుణాలు ఉన్న ఈ చెట్టుకి వర్షపునీరే ప్రాణదారం. ఎలాంటి ఎరువులు అవసరం లేకుండానే మధురమైన ఫలాలను అందించడంలో సాటి లేదు. పోషక విలువలు పుష్కలంగా ఉన్న సీతా ఫలాలను ప్రజలందరూ ఎంతో ఇష్టంగా తింటారు.



**పోషక విలువలు పుష్కలం...**
పోషకాలు అధికంగా ఉండడంతో సీతాఫలం పండు తియ్యగా ఉంటుంది. ప్రతి ఒక్కరూ ఈ పండును ఇష్టంతో తింటారు. దీంతో మంచి ఆరోగ్యం కూడా లభిస్తుంది. మాంసకృతులు, పీచు, ఖనిజ లవణాలు, విటమిన్లు, శరీరానికి శక్తినిచ్చే కొవ్వు పుష్కలంగా ఉంటాయి. ఇందులో లభించే మెగ్నిషియం శరీర పనితీరును మెరుగుపర్చి గుండెజబ్బుల నుంచి కాపాడుతుంది. సీజన్‌తో పాటు వచ్చే ఈ పండ్లను ప్రతి ఒక్కరూ కచ్చితంగా తీసుకోవాలని వైద్యనిపుణులు సూచనలు ఇస్తారు. సీతాఫలం పండ్లు అమ్మడానికి ప్రధాన రహదారులు జిల్లా మండల కేంద్రాల్లో అమ్ముతున్నారు చుట్టూ పక్కన అడవులు పొదలు ఉన్న దగ్గర ఈ పండ్లను తెంపి రోడ్ల మీద అమ్ముతున్నారు .రోజంతా పండ్లను తీసుకుని ఎన్నో కుటుంబాలు అమ్ముకుని జీవనాధారంగా మలుచుకుంటారు. ఈ పండ్లను ప్రధాన రోడ్ల పక్కన పండ్ల మార్కెట్స్ లో అమ్ముతారు.
సీతాఫలాన్ని తెలంగాణ గ్రామాల్లో సీతల్పండు అని పిలుస్తారు. శాస్త్రీయంగా సీతాఫల చెట్టు 'అనోనాసియా' అనే కుటుంబానికి చెందింది. ఇందులో ప్రపంచ వ్యాప్తంగా రెండు వేలకుపైగా రకాలున్నాయి. చెట్టుకు పూచే పూలన్నీ కాయలుగా కాసే ఏకైక చెట్టు. అవి ఎదిగి పక్వానికి రావడానికి సుమారు ఇరవై ఐదు వారాల సమయం పడుతుంది. కాయ పండు అయ్యాక గుజ్జు ఏర్పడి ఒక్కో గింజ చుట్టూ విడివిడిగా అది అత్తుకునిపోతుంది. పండులోని గింజల సంఖ్యలను బట్టి దాని చర్మంపై గుండ్రని భాగాలుంటాయి. సీత్పలకాయలను తెంపి, తీసుకొచ్చి మక్కబెడుతారు. అవి పండుగా మారిన తరువాత తినటం, అమ్మటం జరుగుతుంది. గ్రామాల్లో అడవులు, గుట్టలు, కొండలకు వెళ్లి పెద్దఎత్తున ఈ కాయలు సేకరించి, వాటిని ఆకుల్లో కమ్మేసి కొద్దిరోజుల్లో వాటిని మాగేలా చేస్తారు. అలా మాగిన తర్వాత వాటిని మార్కెట్‌లో అమ్మకానికి తీసుకొస్తారు. మరికొందరు సీత్పలకాయలను కాల్చి, అందులోని గుజ్జును తినడానికి ఇష్టపడుతుంటారు.

ఈ సీజన్‌లో సీతాఫలాలకు అధిక డిమాండ్ ఉంటుంది. సీతా ఫలాల బుట్టకు రూ.300 నుంచి రూ.400ల వరకు మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. సీతాఫలాల విక్రయానికి హైదరాబాద్ సాగర్ రహదారి కేరాఫ్‌గా మారింది. హైదరాబాద్ నుంచి సాగర్‌వైపు, సాగర్ నుంచి నగరం వైపు రాకపోకలు సాగించే ప్రయాణికులు పెద్దఎత్తున పండ్లు కొనుగోలు చేస్తుంటారు. నిజామాబాద్ నుంచి ఇబ్రహీంపట్నం వరకు ఇబ్రహీంపట్నం నుంచి బీఎన్‌రెడ్డి వరకు పెద్ద ఎత్తున కొందరు సీతాఫలాలు విక్రయించి జీవనోపాధి పొందుతున్నారు.

**ఈ సారి వానలు తక్కువగా పడటంతో తక్కువుగా కాశాయి**
వర్షాలు తక్కువ కురువడంతో సీతాఫలాలు ఈసారి తక్కువగా కాశాయి. అడవిలో ఉన్న చెట్లకు విరివిగా కాయలు వచ్చాయి. సీతాఫలాలు విరివిగా దొరుకుతుండటంతో వాటిని తెంపుకొని, మాగబెట్టి నగరానికి తరలించి, ఉపాధి పొందుతున్నారు అన్ని ప్రాంతాల్లో ,మార్కెట్‌లో సీతాఫలాలు బుట్టకు రూ.300ల నుంచి రూ.400ల వరకు విక్రయిస్తున్నారు సీతాఫలాలు తీసుకుందాం ఆరోగ్యంగా ఉందాం

**కామిడి సతీష్ రెడ్డి**
**భూపాల్ పల్లి జిల్లా**
**9848445134**

# జోర్దార్ ఎఫెక్ట్..

## మంచిర్యాల జిల్లా వ్యవసాయ అధికారిపై విచారణతో సర్వత్రా ఆసక్తి!



**(జోర్దార్ మంచిర్యాల్ ప్రతినిధి)**మంచిర్యాల జిల్లా వ్యవసాయ అధికారిపై విచారణకు ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో అక్టోబర్ 24న జరగిన విచారణపై ఆసక్తి నెలకొంది. సంబంధిత శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులను విచారణకు హాజరు కావాలని డీఆర్డీఏ అధికారులు ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం.

**విచారణ నిష్పక్షపాతంగా సాగుతుందా?**
సదరు అధికారిపై వచ్చిన ఆరోపణలపై విచారణాధికారులు సమగ్రంగా పరిశీలించి, వాస్తవాలను వెలుగులోకి తీసుకొచ్చి నిష్పక్షపాత నివేదిక సమర్పిస్తారా? లేక విచారణ నివేదిక సదరు అధికారికి అనుకూలంగా ఉంటుందా? అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.
అయితే, విచారణ పూర్తికాకముందే ఎవరినీ దోషిగా నిర్ధారించలేం. ఆరోపణలకు సంబంధించిన ఆధారాలను పరిశీలించి, సంబంధిత ఉద్యోగుల వాంగ్మూలాలను నమోదు చేసి, వాస్తవాల ఆధారంగా నివేదిక సమర్పించాల్సిన బాధ్యత విచారణాధికారులపై ఉంది.
అక్టోబర్ 24న జరిగిన విచారణలో వాస్తవాలు వెలుగులోకి వస్తాయా? విచారణ నివేదికలో ఏ అంశాలు ప్రస్తావిస్తారు? ప్రభుత్వానికి సమర్పించే నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయా? అన్నది వేచి చూడాల్సి ఉంది.

# ఉచిత న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

- హుస్సేన్



**ఆదిలాబాద్,జోర్దార్ ప్రతినిధి:**నిరుపేద ఖైదీలు లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టమ్ ద్వారా అందించే ఉచిత న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆదిలాబాద్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి హుస్సేన్ అన్నారు. శనివారం జిల్లా జైలును లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులతో సందర్శించారు. న్యాయాన్ని పొందే విధానాన్ని ఖైదీలకు వివరించారు. ఖైదీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. లీగల్ ఎయిడ్ కౌన్సిల్స్ ఉమేష్ రావు డోలే, అర్గుల అశోక్, రూపేశ్ ఉన్నారు.

## అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని

# మంత్రులకు ప్రణవ్ విజ్ఞప్తి



**హైదరాబాద్,(జోర్దార్ ప్రతినిధి):**హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ శుక్రవారం ప్రజాభవన్‌లో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు.
ఈ సందర్భంగా నియోజకవర్గంలోని అభివృద్ధి పనులు, దళిత బంధు, అంబేద్కర్ భవన్‌తో పాటు వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు మంజూరు చేయాలని మంత్రులను కోరారు.

# ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి



- సమ్మెకు మద్దతు తెలిపిన మాజీ ఎమ్మెల్యే

**వికారాబాద్,(జోర్దార్ ప్రతినిధి)**వికారాబాద్ పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం సమీపంలో సమ్మె చేస్తున్న జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఉద్యోగులకు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు చేస్తున్న డిమాండ్లు న్యాయస మ్మతమైనవని, ప్రభుత్వం వాటిని వెంటనే పరిష్కరించాలని కోరారు.
ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల క్రమబద్ధీకరణతో వారు ఎదుర్కొంటున్న అనేక సమస్యలు పరిష్కారించాలనీ ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలపై సానుకూలంగా స్పందించి, వారి డిమాండ్లను నెరవేర్చాలని డాక్టర్ మెతుకు ఆనంద్ కోరారు.

# ఎన్‌హెచ్‌ఎం సమ్మె ప్రభావం లేకుండా వైద్య సేవలు కొనసాగాలి

- డి ఎం హెచ్ ఓ డాక్టర్ అప్పయ్య



**కాజీపేట్ జోర్దార్,(జోర్దార్ ప్రతినిధి)**హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ అప్పయ్య ధర్మసాగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ముప్పారం ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ను సందర్శించి వైద్య సేవలు, రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. ప్రాథమిక వైద్యం, ఆరోగ్య పరీక్షలు, మాతా శిశు సంరక్షణ, వ్యాధుల నివారణ కార్యక్రమాల అమలుపై సమీక్ష నిర్వహించారు. జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఉద్యోగుల సమ్మె నేపథ్యంలో ప్రజలకు వైద్య సేవల్లో ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత వైద్య సిబ్బందికి సూచించారు.అత్యవసర వైద్య సేవలు, ప్రాథమిక ఆరోగ్య సేవలు నిరంతరాయంగా అందించాలని, రోగులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు.
ఆరోగ్య కేంద్రాల్లో రికార్డులను సక్రమంగా నిర్వహిస్తూ, వైద్య సేవల నాణ్యతను పర్యవేక్షించాలని డాక్టర్ అప్పయ్య సూచించారు.

# రాజ్యాంగ పరిరక్షణకు

- హుస్నాబాద్ నియోజకవర్గ జేఏసీ చైర్మన్ కవ్వ లక్ష్మారెడ్డి పిలుపు



**సైదాపూర్,(జోర్దార్ ప్రతినిధి)**హుస్నాబాద్ నియోజకవర్గ జేఏసీ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఏర్పాటుపై సైదాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. రాజ్యాంగ హక్కులపై ప్రజల్లో చైతన్యం కల్పించడమే లక్ష్యంగా ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ కవ్వ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగంలోని లౌకిక, ప్రజాస్వామ్య విలువలను కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాన్ని పరిరక్షించేందుకు ప్రజలు ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. బడుగు, బలహీన, అణగారిన వర్గాల హక్కులకు భంగం కలిగించే శక్తులను సామాజిక చైతన్యంతో ఎదుర్కోవాలని కోరారు.

# గుంటలమయంగా ఎర్రవల్లి--అలంపూర్ రహదారి



- మురుగునీటితో వాహనదారులకు తప్పని ఇబ్బందులు

**జోగులాంబ గద్వాల్,(జోర్దార్ ప్రతినిధి)**ఎర్రవల్లి మండల కేంద్రం నుంచి అలంపూర్‌కు వెళ్లే రహదారి గుంటలమయంగా మారడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ఎర్రవల్లి వద్ద రహదారిపై ఏర్పడిన గుంటల్లో మురుగునీరు చేరడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. ఈ మార్గంలో నిత్యం ప్రయాణించే వాహనదారులు,స్థానిక ప్రజలుఅనేక అవస్థలు పడుతున్నారు.
రహదారిపై గుంటల కారణంగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
సంబంధిత అధికారులు వెంటనే స్పందించి గుంటలను పూడ్చి,రహదారికి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

# కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జనగణన కులగణనలో బీసీ కాలాన్ని ఏర్పాటు చేయాలి



- కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మూడు డిక్లరేషన్లను అమలు చెయ్యాలి.
- బి ఎల్ ఎఫ్ నాయకుల డిమాండ్.

**బెల్లంపల్లి జోర్దార్ ప్రతినిధి:**కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జనగణన, కులగణన,లో బీసీ కాలాన్ని ఏర్పాటు చేయాలని, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మూడు డిక్లరేషన్లను అమలు చేయాలని, బి ఎల్ ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఎం సిపిఐయు పార్టీ కార్యాలయంలో పసులేటి వెంకటేష్, అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో బిఎల్‌ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ సంకె రవి, సబ్బని రాజేంద్రప్రసాదులు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు, ఇటీవల హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన రాష్ట్ర స్థాయి రౌండ్ టేబుల్ సమావేశం పిలుపులో భాగంగా నవంబర్ 1న మంచిర్యాల జిల్లా కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నామని, కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జనగణన కులగణనలో బీసీ కాలాన్ని పెట్టకుండా, బీసీల జనాభా,ఆర్థిక, సామాజిక,రాజకీయ లెక్కలు తియ్యడం లేదనీ, ఫలితంగా బీసీలు భవిష్యత్తులో తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఉందని, బీసీ కాలాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే బిసి, ఎస్సి, ఎస్టి, డిక్లరేషన్లు ఏర్పాటు చేసి అమలు చేస్తామనీ హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చి 3 సంవత్సరాలు గడిచిన వాటి ఊసేత్తడం లేదని, డిక్లరేషన్లు ఏర్పాటు చేసి అమలు చేయాలని, బీసీ కాలాన్ని చేర్చాలని, కేంద్ర,
ప్రభుత్వంపై ఒత్తిడి తిసుకురావడం కోసం రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశామని తెలిపారు. నవంబర్ 1న జరిగే రౌండ్ టేబుల్ సమావేశానికి సామాజిక సంస్థలు,నాయకులు, ఆలోచన పరులు హాజరు కావాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో కన్నూరి సమ్మయ్య,తోగరి రాములు, జెంజర్ల శేఖర్,శంభోజీరాజేష్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## నేడు సమాజానికి అత్యంత ఆవశ్యకమైన

# "అవయవ దానం"

ప్రాముఖ్యత గురించి ప్రతి ఒక్కరిలో ఆలోచన కలిగించేందుకు కోసం నా వంతు బాధ్యతగా నేను వ్రాసిన కవిత:

ఒకరికి ప్రాణ దానంతో–
ఒక కుటుంబానికి ఆయుష్షు!.
మనిషి'గా పుట్టడం గొప్ప కాదు,
మది'లో కనికరం ఉండటం గొప్ప!.

మనం ఈ లోకం విడిచి వెళ్లినా,
మనం దానం చేసిన అవయవాల ద్వారా,
మరొకరి రూపంలో ఈ భూమ్మీద జీవించొచ్చు!.

ఇతరుల ప్రాణాలు నిలిపే,
ఈ అవయవ దానం!.
అన్ని దానాలలో మిన్న!.

నేల రాలే ఆకు'లా రాలిపోయే ముందే,
మన'లోని ప్రాణం మరొకరి'లో నిలుపొచ్చు!.

మన కళ్ళ ద్వారా చూసిన ఈ లోకాన్ని,
మన తరువాత కూడా...
చూపు లేనివారికి వెలుగును పంచొచ్చు!.

మనం'లేని ఈ లోకంలో...
మన గుండె మరొకరి చాతిలో,
కొత్త తలుపులు కావాలి!.

మన కిడ్నీలు మరొకరి జీవన పోరాటంలో
నవ్వులు పూయించాలి!.

మరణం మనకు తుది అంకం కాకూడదు,
మరొకరి జీవన యానానికి అది నాంది కావాలి!.

ఎన్ని దాన,ధర్మాలు చేసినా రాని ఆత్మ సంతృప్తి, ఒక ప్రాణాన్ని నిలబెట్టే అవయవ దానానికి ఉంది!.

మన జీవితాన్ని ఇతరులతో పంచుకుందాం!,
అవయవ దానం చేసి,
ఆ ఒక్కరి'పై ఆధారపడిన,
ఒక కుటుంబాన్ని కాపాడుకుందాం!.



పేరు: పర్వ వెంకటేశం,
రిటైర్డ్ డిప్యూటీ డైరెక్టర్,
తెలంగాణ ప్రభుత్వ సమాచార,
పౌర సంబంధాల శాఖ,
హైదరాబాద్.

## భూ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి



- లక్నవరం,జయగిరి గ్రామాల్లో సర్వే పనులను పరిశీలించిన అదనపు కలెక్టర్

**హసన్ పర్తి(జోర్దార్ ప్రతినిధి)**హసన్ పర్తి మండలంలోని లక్నవరం,జయగిరి గ్రామాల్లో కొనసాగుతున్న భూ సర్వే పనులను అదనపు కలెక్టర్ రవి, హసన్ పర్తి తహసీల్దార్ కిరణ్ కుమార్ పరిశీలించారు. క్షేత్రస్థాయిలో సర్వే పనుల పురోగతిని తనిఖీ చేసి, సర్వే నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సంబంధిత సిబ్బందికి పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఎన్ రవి మాట్లాడుతూ భూ సర్వేను పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని,భూముల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి నమోదు చేయాలని, సర్వే ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని,భూములకు సంబంధించిన వివరాలపై స్పష్టతతో పని పూర్తి చేయాలని అన్నారు.సర్వే పనులను నిర్ణీత పద్ధతిలో నిర్వహిస్తూ, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జీ పీ లు,వనిత, సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

## ఎల్‌నినో పరిస్థితులపై
# అప్రమత్తంగా ఉండాలి

- సీఎం రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్,(జోర్దార్ ప్రతినిధి)**రాష్ట్రంలో ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో ప్రభుత్వం జారీ చేసిన సూచనలకు అనుగుణంగా నియోజకవర్గాల్లో పరిస్థితులను అంచనా వేసుకుని ముందస్తు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. శుక్రవారం ప్రజాభవన్‌లో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశానికి హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రణవ్ మాట్లాడుతూ హుజురాబాద్ నియోజకవర్గంలో ప్రజల అవసరాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నామని, ప్రభుత్వం ఇచ్చే సూచనలను అమలు చేసేలా ఇప్పటికే అధికారులకు ఆదేశాలు ఇచ్చామని తెలిపారు.

## పబ్లిక్ పాలసీ కోర్సుకు
## నిర్మల్ ఎస్పీ ఎంపిక



**ఆదిలాబాద్,(జోర్దార్ ప్రతినిధి)**నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి శర్మిల హైదరాబాద్‌లోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ)లో నిర్వహించే అడ్వాన్స్‌డ్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్ ఇన్ పబ్లిక్ పాలసీ--2027 కోర్సుకు ఎంపికయ్యారు. కేంద్ర ప్రభుత్వ స్పాన్సర్‌షిప్‌తో నిర్వహించే ఈ కార్యక్రమానికి దేశవ్యాప్తంగా వివిధ శాఖలకు చెందిన 60 మంది అధికారులు, మేనేజ్‌మెంట్ నిపుణులు ఎంపికయ్యారు. వీరిలో ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్, ఐఆర్ఎస్ అధికారులు ఉన్నారు. ప్రజా విధానాల రూపకల్పన, పాలన, పరిపాలనా నైపుణ్యాల అభివృద్ధికి ఈ కోర్సు దోహదపడనుంది.

# రామగిరి వార్డు మెంబర్ల ఫోరం అధ్యక్షుడిగా చేతి సుధాకర్

- 42 ఓట్లతో విజయం.. ఎన్నికపై ఆరోపణలను ఖండించిన ఇన్‌ఛార్జ్ సొప్పరి సంతోష్ కుమార్



**రామగిరి, జోర్దార్ ప్రతినిధి:**తెలంగాణ రాష్ట్ర వార్డు మెంబర్ల ఫోరం రామగిరి మండల అధ్యక్షుడిగా పన్నూరు గ్రామానికి చెందిన చేతి సుధాకర్ ఎన్నికయ్యారు. శుక్రవారం రత్నాపూర్ రైతు వేదికలో నిర్వహించిన ఎన్నికల్లో 69 మంది వార్డు సభ్యులు పాల్గొనగా, చేతులెత్తే పద్ధతిలో జరిగిన ఎన్నికలో చేతి సుధాకర్‌కు 42 ఓట్లు, అల్లి రమేష్‌కు 27 ఓట్లు లభించాయి. మెజారిటీ సభ్యుల మద్దతుతో చేతి సుధాకర్‌ను అధ్యక్షుడిగా ప్రకటించినట్లు ఫోరం మంథని నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ సొప్పరి సంతోష్ కుమార్ తెలిపారు. శనివారం బేగంపేట ఎక్స్‌రోడ్‌లోని మంథని బ్లాక్ కాంగ్రెస్ కార్యాలయంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్ అధ్యక్షతన నిర్వహించిన విలేకరుల సమావేశంలో సంతోష్ కుమార్ మాట్లాడారు. గత 20 రోజులుగా మండల కమిటీ ఏర్పాటుపై కసరత్తు చేసి, ఇతర మండలాల్లో అనుసరించిన విధంగానే పారదర్శకంగా ఎన్నిక నిర్వహించామని చెప్పారు. నూతన అధ్యక్షుడితో పాటు మరో 18 మందితో కమిటీని ప్రకటించి, వారికి అధికారిక లెటర్ ప్యాడ్ అందజేసినట్లు వెల్లడించారు. ఫోరం గౌరవ అధ్యక్షుడు నాగబెల్లి జ్యోతి మహేష్ ఆదేశాల మేరకు ఎన్నిక ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించామని సంతోష్ కుమార్ పేర్కొన్నారు. ఎన్నిక ప్రక్రియపై కొందరు చేస్తున్న ఆరోపణలను ఆయన ఖండించారు. ఫోరం వ్యవస్థకు నష్టం కలిగించేలా వ్యవహరించడం సరి కాదని, సభ్యుల ఐక్యతను దెబ్బతీసే ప్రయత్నాలను సహించబోమని స్పష్టం చేశారు.ఫోరంలో రాజకీయాలకు అతీతంగా సభ్యులందరినీ కలుపుకొని ముందుకు సాగుతామని సంతోష్ కుమార్ తెలిపారు. వార్డు సభ్యుల సమస్యలు, డిమాండ్ల పరిష్కారం కోసం నూతన కమిటీ కృషి చేస్తుందని చెప్పారు. మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన సభ్యులకు సముచిత ప్రాధాన్యం కల్పిస్తూ ఫోరాన్ని బలోపేతం చేస్తామని పేర్కొన్నారు.ఈ సమావేశంలో పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ కమిటీ నాయకుడు ఎల్లె రామ్మూర్తి, మాజీ ఎంపీపీ అరెల్లి దేవిక కొమురయ్య గౌడ్, మాజీ సర్పంచ్‌లు తీగల సమ్మయ్య, ఎరుకల బాపూరావు, కాంగ్రెస్ నాయకులు ఒగ్రె సదయ్య, మాదాసి శ్రీనివాస్, బండ సంపత్, అరెల్లి విజయ, రాము యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో ప్రజల
## విశ్వాసాన్ని పెంపొందించాలి



- హుజురాబాద్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన సీపీ గౌస్ ఆలం

**హుజురాబాద్,(జోర్దార్ ప్రతినిధి)**పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులకు సత్వర న్యాయం అందిస్తూ,ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో ప్రజల విశ్వాసాన్ని పెంపొందించా లని పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం సిబ్బందికి సూచించారు.శనివారం వార్షిక తనిఖీల్లో భాగంగా హుజురాబాద్ పోలీస్ స్టేషన్‌ను ఆయన సందర్శించారు.ఈ సందర్భంగా సాయుధ బలగాల గౌరవ వందనం స్వీకరించి,స్టేషన్‌లోని రికార్డులు,రిజిస్టర్లు,వివిధ విభాగాలను పరిశీలించారు.
శాంతిభద్రతల పరిరక్షణలో పారదర్శకత,వేగవంతమైన పనితీరు కనబరచాలని సూచించారు. నేరాల నియంత్రణకు సీ సీ కెమెరాలు,పెట్రోలింగ్ వాహనాలు,ఆధునిక పరికరాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు.
కేసు ఆస్తుల భద్రత, రికా ర్డుల నిర్వహణ, స్టేషన్ పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు.
ఈ కార్యక్రమంలో ఏసీపీ మాధవి, ఇన్‌స్పెక్టర్ కరుణాకర్, ఎస్సైలు రవి, కృష్ణారావు,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



- బీజేపీ పట్టణ అధ్యక్షుడు తూర్పాటి రాజు

**హుజురాబాద్,(జోర్దార్ ప్రతినిధి)**పార్టీ సంస్థాగత బలోపేతంలో బూత్ కమిటీలే వెన్నెముకని,ప్రతి బూత్‌లో పార్టీని పటిష్టం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ హుజురాబాద్ పట్టణ అధ్యక్షుడు తూర్పాటి రాజు పిలుపునిచ్చారు.
శనివారం పట్టణంలో నిర్వహించిన శక్తి కేంద్ర ఇన్‌చార్జిల సమావేశంలో బూత్ కమిటీల బలోపేతం, యువజన సమ్మేళనాలు, ప్రధాని మోదీ మన్ కీ బాత్ కార్యక్రమాల నిర్వహణపై చర్చించారు.ప్రతి శక్తి కేంద్రంలో టిఫిన్ బైఠక్ నిర్వహించనున్నట్లు తెలిపారు.
ఈ సమావేశంలో జిల్లా కౌన్సిల్ సభ్యుడు రావుల వేణు, సెంట్రల్ ఫిల్మ్ బోర్డు సభ్యుడు సబ్బని రమేష్, తూముల శ్రీని వాస్, గంట సంపత్, తిప్పబత్తిని రాజు, యాళ్ల సంజీవరెడ్డి, వోడ్నాల విజయ్, కొలిపాక వెంకటేష్,శశిధర్, నరాల రాజశేఖర్,అంకతి వాసు తదితరులు పాల్గొన్నారు.

# రిమ్స్‌లో విషాదం
## తల్లి, కవల శిశువులు మృతి

- వైద్యుల నిర్లక్ష్యంపై కుటుంబ సభ్యుల ఆరోపణలు
- సమగ్ర విచారణకు డిమాండ్




**ఆదిలాబాద్,(జోర్దార్ ప్రతినిధి)**ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలో విషాదం చోటుచేసుకుంది. ఉట్నూర్‌కు చెందిన ఏడు నెలల గర్భిణీ బి. సునీతతో పాటు ఆమె కడుపులోని కవల శిశువులు మృతి చెందారు. కాళ్ల వాపులతో ఈ నెల 21న ఆసుపత్రిలో చేరిన సునీతకు బీపీ పెరగడంతో మృతి చెందినట్లు సమాచారం.
వైద్యుల నిర్లక్ష్యమే కార ణమని కుటుంబ సభ్యులు ఆరోపిస్తూ, ఘటనపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలు వెల్లడించాలని డిమాండ్ చేస్తున్నారు.అయితే నిర్లక్ష్యంపై ఆరోపణలు అధికారికంగా నిర్ధారణ కాలేదు.

## రైతులకు ఉచితంగా వేప నూనె
## నానో యూరియా పంపిణీ



- సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పించడమే లక్ష్యం

**చింతూరు,(ఏపీ స్టేట్ జోర్దార్ బ్యూరో)**పీపుల్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పోలవరం జిల్లా చింతూరు మండలం శుద్ధగూడెం గ్రామ రైతులకు ఉచితంగా వేప నూనె (నీమ్ ఆయిల్), నానో యూరియా పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సంస్థ కోఆర్డినేటర్ ముమ్మడి అశోక్ మాట్లాడుతూ రైతులకు సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పించడం, పర్యావరణహిత వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడమే కార్యక్రమం లక్ష్యమని తెలిపారు.రైతులు రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగాన్ని తగ్గించి ప్రకృతికి అనుకూలమైన వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని సూచించారు.
నేల ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ పంటల దిగుబడిని మెరుగుపరుచుకునేందుకు ఆధునిక, పర్యావరణహిత పద్ధతులపై అవగాహన పెంచుకోవాలని కోరారు.

## సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో
## టిఎన్టియుసి సైతం పోటీలో ఉంటుంది



- టిఎన్టియుసి రాష్ట్ర అధ్యక్షులు ఎంకే బోస్.

**(హైదరాబాద్ జోర్దార్ ప్రత్యేక ప్రతినిధి)**రానున్న సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో, సింగరేణి కాలరీ స్ లేబర్ యూనియన్ (టి ఎన్ టి యు సి) సైతం పోటీలో ఉంటుందని రాష్ట్ర టిఎన్టియుసి అధ్యక్షులు ఎంకె బోస్ తెలిపారు. .
హైదరాబాద్ ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్లో, శనివారం తెలుగుదేశం పార్టీ పోలిట్ బ్యూరో సభ్యులు అరవింద కుమార్ గౌడ్, జోత్స్న మేడం, ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆర్టీసీలో ఇటీవల జరిగిన ఎన్నికలు, సింగరేణి సంస్థ భవిష్యత్తు, కార్మికుల సమస్యలపై దృష్టి సారించి, రాబోయే సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలపై రాష్ట్ర కమిటీ అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి నిర్ణయం తీసుకున్నామని, సింగరేణి సంస్థలో కార్మికుల హక్కుల పరిరక్షణకు, కార్మికుల అపరిష్కృత సమస్యలపై విస్తృతంగా చర్చించామని, వీటన్నింటినీ సాధించాలంటే సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో తెలుగు నాడు ట్రేడ్ యూనియన్ కౌన్సిల్, టి ఎన్ టి యు సి తరపున పోటీ చేయాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించి నిర్ణయం తీసుకుందని తెలిపారు.
ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి మణిరాం సింగ్, ఏబీఎన్ మోహన్ రావు, గద్దల నారాయణ, బొల్లు మల్లయ్య, కొండి శ్రీనివాస్, గజ్జె దుర్గయ్య, మధునయ్య, దండే సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.

## భూ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి



- లక్నవరం,జయగిరి గ్రామాల్లో సర్వే పనులను పరిశీలించిన అదనపు కలెక్టర్

**హసన్ పర్తి,(జోర్దార్ ప్రతినిధి)**హసన్ పర్తి మండలంలోని లక్నవరం,జయగిరి గ్రామాల్లో కొనసాగుతున్న భూ సర్వే పనులను అదనపు కలెక్టర్ రవి, హసన్ పర్తి తహసీల్దార్ కిరణ్ కుమార్ పరిశీలించారు. క్షేత్రస్థాయిలో సర్వే పనుల పురోగతిని తనిఖీ చేసి, సర్వే నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సంబంధిత సిబ్బందికి పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఎన్ రవి మాట్లాడుతూ భూ సర్వేను పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని,భూముల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి నమోదు చేయాలని, సర్వే ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని,భూములకు సంబంధించిన వివరాలపై స్పష్టతతో పని పూర్తి చేయాలని అన్నారు.సర్వే పనులను నిర్ణీత పద్ధతిలో నిర్వహిస్తూ, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తెలిపారు.
ఈ కార్యక్రమంలోసర్వేయర్ సుజత,జీ పీ ఓ వనిత, సర్వేయర్లు,రైతులు పాల్గొన్నారు.

RNI NO.TGTEL/25/A5224
జోర్దార్
JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక
అవినీతి అంతం - మా పంతం



# బాక్సింగ్‌లో హసన్‌పర్తి విద్యార్థుల సత్తా

## రాష్ట్రస్థాయి పోటీలకు ఏడుగురి ఎంపిక




■ క్రీడాకారులను అభినందించిన గొర్రె కిరణ్ కుమార్

**హసన్‌పర్తి,(జోర్దార్ ప్రతినిధి)**క్రీడారంగంలో హసన్ పర్తి ప్రాంత విద్యార్థులు తమ ప్రతిభను చాటు కుంటున్నారు. ఇటీవల నిర్వహించిన 70వ రాష్ట్రస్థాయి అండర్-17 ఎస్‌జీఎఫ్ ఉమ్మడి వరంగల్ జిల్లా బాలబాలికల బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన ఏడుగురు క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. హసన్‌పర్తి ప్రాంత విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించడం హర్షణీయమని 66వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గొర్రె కిరణ్ కుమార్ అన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారుల్లో ఎస్. తనుశ్రీ (ఎస్ఆర్ కాలేజీ), ఎస్. లాస్య (మాంటిస్సోరి), బి. వైష్ణవి,పి. వరుణ్,బి. అభినవ్ (జెడ్పీహెచ్ఎస్ హసన్‌పర్తి),జి. విశ్వతేజ, ఎస్. అమృత్‌రాజ్ (సెయింట్ మేరీస్)ఉన్నారు. వీరు బోడుప్పల్‌లో డీవీఆర్ అకాడమీలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో పాల్గొనను న్నారు.

ఈసందర్భంగా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను 66వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గొర్రె కిరణ్ కుమార్,మాజీ కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్,దేవస్థాన చైర్మన్ ఆరెల్లి వెంకటస్వామి తదితరులు అభినందిస్తూ క్రీడాకారులకు శిక్షణ అందించిన కోచ్ ఎస్. నరేందర్ దేవ్,పీడీ ఎస్. పార్థసారథిని ప్రశంసించారు.

# ఉద్యమకారుల సహనాన్ని పరీక్షించవద్దు

■ 26న సీఎం నివాసం ముట్టడి

■ తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ప్రచార కార్యదర్శి చిలువేరు రమేష్ హెచ్చరిక




**హనుమ కొండ జోర్దార్ ప్రతినిధి:**తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కోసం ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ప్రచార కార్యదర్శి చిలువేరు రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నెల 26లోగా ప్రక్రియ ప్రారంభించకపోతే ముఖ్యమంత్రి నివాసం ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ నెల 13న కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన మహాధర్నాలో ఇచ్చిన గడువు సమీపిస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు. ఉద్యమకారులకు నెలవారీ పెన్షన్, ప్రత్యేక హెల్త్ కార్డుల ద్వారా ఉచిత కార్పొరేట్ వైద్యం, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని కోరారు. నిరుపేద ఉద్యమకారులకు ఇంటి స్థలాలు కేటాయించి, ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో ప్రాధాన్యం ఇవ్వాలని,వారి పిల్లలకు విద్య, ఉపాధి అవకాశాల్లో ప్రత్యేక కోటా కల్పించాలని డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధన కోసం ఈ నెల 26న చేపట్టనున్న సీఎం నివాసం ముట్టడి కార్యక్రమంలో ఉద్యమకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని రమేష్ పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మోదీనపురోజు రాముచారి,ములుగు జిల్లా అధ్యక్షుడు బిక్షపతి, జనగామ జిల్లా ప్రధాన కార్యదర్శి ముక్కెర కుమారస్వామి,చెల్పూర్ మండల అధ్యక్షుడు మొగిలి,కాజీపేట మండల అధ్యక్షుడు బస్కే రాజేందర్,
వర్ధన్నపేట కో-కన్వీనర్ మర్కా భాస్కర్ గౌడ్, ముంజ దేవేందర్,కల్లిపెల్లి రాజు, బుర్ర రవీందర్, మోటపోతుల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చే

## ప్రతిపాదనను విరమించుకోవాలి

■ రజక సంఘం నేత చిట్యాల భిక్షపతి ఆవేదన



**హసన్‌పర్తి,(జోర్దార్ ప్రతినిధి)**ముదిరాజ్‌లను బీసీ-డీ నుంచి బీసీ-ఏలో చేర్చే ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని ఉమ్మడి వరంగల్ జిల్లా రజక సంఘం ప్రధాన కార్యదర్శి చిట్యాల భిక్షపతి అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఈ నిర్ణయం వల్ల ఇప్పటికే బీసీ-ఏలో ఉన్న కులాలకు విద్యా, సామాజిక, రాజకీయ రంగాల్లో అన్యాయం జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. బీసీ-ఏలోని వెనుకబడిన కులాల ప్రయోజనాలను కాపాడాలని, ముదిరాజ్‌లను ఆ వర్గంలో చేర్చే ప్రతిపాదనను ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ప్రతిపాదనను వెనక్కి తీసుకోకపోతే రానున్న ఎమ్మెల్సీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా ప్రచారం చేస్తామని హెచ్చరించారు. బీసీ-ఏ కులాల హక్కుల పరిరక్షణ కోసం ఐక్యంగా పోరాడుతామని స్పష్టం చేశారు.

# బెల్లంపల్లిలో నిర్వహిస్తున్న

## రాష్ట్రస్థాయి త్రో బాల్ శిక్షణ క్యాంప్



■ క్రీడాకారులు శిక్షణను సద్వినియోగం చేసుకొని జాతీయస్థాయిలో పేరు తేవాలి.

■ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పులియాల రవికుమార్.

**బెల్లంపల్లి జోర్దార్ ప్రతినిధి:**రాష్ట్రస్థాయి 34వ త్రో బాల్ శిక్షణ శిబిరాన్ని 40 మంది క్రీడాకారులతో వారం రోజులపాటు బెల్లంపల్లి పట్టణంలోని తిలక్ క్రీడా మైదానంలో నిర్వహిస్తున్నట్లు, త్రోబాల్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పులియాల రవికుమార్, కార్యదర్శి యాదాన్ల బలరామ్, లు శనివారం తెలిపారు.
ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ, రాష్ట్ర స్థాయి త్రో బాల్ క్రీడాకారులను మరింత ప్రతిభావంతులుగా, సుశిక్షితులుగా తీర్చిదిద్దేందుకు శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేశామని, ఈనెల 29 నుండి నవంబర్ 1 వరకు కోల్కత్తాలో జరిగే జాతీయ స్థాయి పోటీలలో సబ్ జూనియర్ బాల బాలికల జట్లు పాల్గొంటాయని తెలిపారు.
జాతీయస్థాయిలో రాణించే విధంగా సుశిక్షితులైన శిక్షకులతో కోచింగ్ ఇప్పిస్తున్నామని,జాతీయ స్థాయిలోను పాల్గొని వారి ప్రతిభను కనబరిచే విధంగా జట్లను తయారు చేస్తున్నామని ధీమా వ్యక్తం చేశారు. క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని త్రో బాల్ క్రీడల్లో మంచి ప్రతి కనబరిచి, రాష్ట్రానికి మంచి పేరు తేవాలని పలువురు క్రీడాభిమానులు ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.
ఈ శిక్షణ శిబిరానికి, క్రీడల నిర్వహణకు, అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందించిన ప్రతి ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా

## కార్యదర్శిగా చంద్రకాంత్ నియామకం

■ గుమ్ముల శ్రీనివాస్.



**మంచిర్యాల జోర్దార్ జిల్లా ప్రతినిధి:**జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి, మంచిర్యాల జిల్లా కార్యదర్శిగా జైపూర్ మండల రామారావు పేట గ్రామానికి చెందిన పెద్దల చంద్రకాంత్ ను నియమించినట్లు, జిల్లా అధ్యక్షులు గుమ్ముల శ్రీనివాస్ తెలిపారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చంద్రకాంత్ గత కొంతకాలంగా బీసీ ఉద్యమాలలో పని చేస్తూ, బీసీ భావజాల వ్యాప్తికి కృషి చేస్తున్నాడని గుర్తించి సంఘ నిర్మాణానికి కృషి చేసేందుకు నియమించినట్లు తెలిపారు.
పెద్దల్ల చంద్రకాంత్ మాట్లాడుతూ, నాపై నమ్మకంతో జిల్లా కార్యదర్శిగా అవకాశం కల్పించిన జిల్లా కార్యవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు. నాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా, బీసీ ఐక్యతకు కృషి చేస్తూ, బీసీ హక్కుల సాధనకై నిర్విరామంగా పనిచేస్తూ, బీసీ ల రాజ్యాధికారమే అంతిమ లక్షముగా పని చేస్తానని, తనకు పదవి రావడానికి సహకరించిన నాయకులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.

# రిమ్స్‌లో వరుస విషాదాలు

## బాలింత,కవల శిశువుల మృతిపై విచారణ జరపాలి

■ రిమ్స్ డైరెక్టర్, డీఎంహెచ్‌వో బాధ్యతలను సమీక్షించాలి

■ దళిత జాక్ రాష్ట్ర అధ్యక్షుడు కాంబ్లె ప్రజ్ఞశీల్ డిమాండ్



**ఆదిలాబాద్, జోర్దార్ ప్రతినిధి:**ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలో బాలింతతో పాటు ఇద్దరు కవల శిశువులు మృతి చెందిన ఘటనపై ఉన్నతస్థాయి, నిష్పక్షపాత విచారణ జరిపించాలని దళిత జాక్ రాష్ట్ర అధ్యక్షుడు కాంబ్లె ప్రజ్ఞశీల్ డిమాండ్ చేశారు. నెల రోజుల క్రితం పసిపిల్లల మృతి ఘటన మరువకముందే మరో విషాదం చోటుచేసుకోవడం ఆందోళన కలిగిస్తోందని పేర్కొన్నారు.
ఉట్నూర్‌కు చెందిన బోర్లకుంట సునీత కుటుంబంలో చోటుచేసుకున్న ఈ విషాదం తీరని శోకాన్ని మిగిల్చిందన్నారు. ఒకే కుటుంబంలో మూడు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలు, పర్యవేక్షణ తీరుపై సమీక్ష జరగాల్సిన అవసరం ఉందని తెలిపారు.

**వైద్య సేవలపై విచారణ ఏదీ?**
బాలింత, శిశువులకు సకాలంలో అత్యవసర వైద్యం అందిందా? వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులు తగిన విధంగా పర్యవేక్షించారా? వైద్య సేవల్లో ఏమైనా లోపాలు జరిగాయా? అనే అంశాలపై సమగ్ర విచారణ జరిపించాలని ప్రజ్ఞశీల్ కోరారు. రిమ్స్ డైరెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సహా సంబంధిత అధికారుల పర్యవేక్షణ బాధ్యతలను సమీక్షించాలని అన్నారు.
ప్రభుత్వ ఆసుపత్రుల్లో గర్భిణులు, బాలింతలు, నవజాత శిశువులకు మెరుగైన వైద్యం అందించేందుకు అవసరమైన వైద్యులు, సిబ్బంది, పరికరాలు, అత్యవసర చికిత్సా సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

**నిర్లక్ష్యం తేలితే చర్యలు తీసుకోవాలి**
గత నెలలో జరిగిన పసిపిల్లల మృతి ఘటనతో పాటు తాజా ఘటనపైనా సమగ్ర విచారణ జరిపించాలని ప్రజ్ఞశీల్ డిమాండ్ చేశారు. విచారణలో నిర్లక్ష్యం లేదా విధి నిర్వహణలో వైఫల్యం తేలితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని, సంబంధిత అధికారుల బాధ్యతలను సమీక్షించి అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు. విచారణ నివేదికను ప్రజలకు వెల్లడించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని అన్నారు.

**తల్లి, శిశువుల సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి**
పేద, దళిత, ఆదివాసీ కుటుంబాలకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్యం అందేలా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపాలని ప్రజ్ఞశీల్ పేర్కొన్నారు.
అత్యవసర వైద్య సేవలను బలోపేతం చేసి, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్టమైన పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరారు.
ప్రజల ప్రాణాల రక్షణకు ప్రాధాన్యమిస్తూ వైద్య సేవల్లో లోపాలను సరిదిద్దాలని ఆయన విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

# ప్రశాంతంగా ఎన్నికల

## నిర్వహణకు పటిష్ట చర్యలు




**చింతూరు,(ఏపీ స్టేట్ జోర్దార్ బ్యూరో)**పోలవరం జిల్లాలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పటిష్ట చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె. దినేష్ కుమార్ తెలిపారు. శనివారం చింతూరులోని ఏపీ రెసిడెన్షియల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. జిల్లాలో నవంబర్ 3న జరగనున్న పోలింగ్‌కు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని తెలిపారు. ఎన్నికల్లో అక్రమాలు, ప్రలోభాలను అరికట్టేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఓటర్లు తప్పనిసరిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

# వినతిపత్రం స్వీకరించలేదని

## ఆశా కార్యకర్తల ఆవేదన

■ ధరూర్ పీహెచ్‌సీ ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరిక

**జోగులాంబ గద్వాల(జోర్దార్ ప్రతినిధి)**ఈ నెల 26న హైదరాబాద్‌లో నిర్వహించనున్న చలో హైదరాబాద్ కార్యక్రమానికి మద్దతుగా, తమ సమస్యల పరిష్కారం కోరుతూ ధరూర్ పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్లిన ఆశా కార్యకర్తలకు నిరాశ ఎదురైంది. మెడికల్ ఆఫీసర్ వినతిపత్రం స్వీకరించలేదని వారు ఆరోపించారు. తమ పట్ల అవమానకరంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తూ, వినతిపత్రాన్ని పీహెచ్‌సీ గోడకు అతికించి నిరసన తెలిపారు. తమ సమస్యలను పరిష్కరించి, గౌరవంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. లేకుంటే పీహెచ్‌సీ ఎదుట పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు.

# నాణ్యమైన తాగునీరు అందించాలి

■ మిషన్ భగీరథ కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**జోగులాంబ గద్వాల,(జోర్దార్ ప్రతినిధి)**ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన తాగునీరు అందించాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. శనివారం జూరాల ప్రాజెక్టు వద్ద ఉన్న మిషన్ భగీరథ కేంద్రాన్ని తనిఖీ చేసి, నీటి శుద్ధి ప్రక్రియ, సిబ్బంది పనితీరు, రికార్డులను పరిశీలించారు. నీటి నాణ్యతను నిరంతరం పరీక్షించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలకు సురక్షిత తాగునీరు అందించడంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# రంగాపూర్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

■ ఇద్దరు యువకులు మృతి

■ ఐదుగురికి తీవ్ర గాయాలు



**హుజూరాబాద్,(జోర్దార్ ప్రతినిధి)**విజయవాడ కనక దుర్గమ్మ దర్శనం చేసుకుని తిరిగి వస్తున్న యువకుల కారును రంగాపూర్ శివారులో లారీ ఢీకొట్టడంతో ఇద్దరు యువకులు మృతి చెందగా, మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన శనివారం తెల్లవారు జామున హుజూరాబాద్ మండల పరిధిలోని 563వ జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. రూరల్ సీఐ వీరబత్తిని శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపల్లి జిల్లా రామగుండానికి చెందిన ఏడుగురు యువకులు ఎర్టిగా కారులో విజయవాడ వెళ్లి అమ్మవారిని దర్శించుకుని తిరిగి వస్తుండగా, రంగాపూర్ శివారులో ముందు వెళ్తున్న లారీని కారు వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బట్టూరి అరవింద్ (20), మత్స్య సాయి (20) అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఐదుగురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు.
సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, హుజూరాబాద్ హెల్ప్ టీమ్ సభ్యులు, స్థానికుల సహాయంతో క్రేన్ ద్వారా కారులో చిక్కుకున్న వారిని బయటకు తీశారు. క్షతగాత్రులను హుజూరాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు పంపించారు. వారిలో ఇద్దరి పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో హైదరాబాద్‌కు తరలించినట్లు సమాచారం.
మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.
ఈ ఘటనతో రామగుండంలో విషాదం నెలకొంది.

# ఓపెన్ హౌస్ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

■ పోలీస్ స్టేషన్‌లోని విభాగాల పనితీరును వివరించిన ఎస్సై అవుల తిరుపతి



**(వీణవంక, జోర్దార్ ప్రతినిధి)**విద్యార్థులకు పోలీస్ వ్యవస్థపై అవగాహన కల్పించడంతో పాటు పోలీసుల విధులు, బాధ్యతలను తెలియజేసేందుకు వీణవంక పోలీస్ స్టేషన్‌లో శనివారం ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలీస్ సంస్మరణ దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో వీణవంక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా ఎస్సై అవుల తిరుపతి పోలీస్ స్టేషన్‌లోని రిసెప్షన్, వైర్‌లెస్ వ్యవస్థ, సాంకేతిక విభాగం, సీసీటీఎన్ఎస్, పోలీస్ రికార్డులు, సీసీ కెమెరాలు, వేలిముద్రల పరికరాల పనితీరును విద్యార్థులకు వివరించారు. పోలీసుల విధులు, బాధ్యతలతో పాటు అత్యవసర సమయంలో అందుబాటులో ఉండే 100 సేవల ప్రాముఖ్యతను తెలియజేశారు.

**మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి**
విద్యార్థులు గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, చెడు అలవాట్లకు బానిసలు కావద్దని ఎస్సై సూచించారు. చదువుపై దృష్టి సారిస్తూ క్రమశిక్షణతో మెలగాలని, మంచి నడవడికతో బాధ్యతగల పౌరులుగా ఎదగాలని కోరారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలోని పిల్లల పార్కును సందర్శించిన విద్యార్థులు ఆటలాడుతూ సందడి చేశారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు పోలీస్ వ్యవస్థపై అవగాహన కల్పించడంతో పాటు పోలీసుల పట్ల నమ్మకాన్ని పెంపొందించే ప్రయత్నం చేశారు.

## అగ్నిప్రమాదానికి గురైన చర్చిని పరిశీలించిన ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్



- చర్చి పునర్నిర్మాణానికి కృషి చేస్తా
- గ్రామ సమస్యల పరిష్కారానికి హామీ

**వికారాబాద్,(జోర్దార్ ప్రతినిధి)**వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట్ మండలం వేల్చాల్ గ్రామంలో శుక్రవారం రాత్రి అగ్నిప్రమాదానికి గురైన చర్చిని తెలంగాణ శాసనసభ స్పీకర్, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్ శనివారం పరిశీలించారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగినట్లు గ్రామ సర్పంచ్, గ్రామస్తులు ఆయనకు వివరించారు. చర్చి పునర్నిర్మాణానికి తన వంతు కృషి చేస్తానని స్పీకర్ హామీ ఇచ్చారు.అనంతరం గ్రామంలో సబ్‌ప్లాన్ నిధులతో రహదారుల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని స్థానిక నాయకులకు సూచించారు.

గ్రామంలో నెలకొన్న బోరుబా వుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, స్థానిక నాయకులు, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

## పోలీస్ అమరవీరుల సంస్మరణార్థం రక్తదాన శిబిరం



- సీఐ మహేందర్ ఆధ్వర్యంలో రక్తదానం

**కాజీపేట(జోర్దార్ ప్రతినిధి)**పోలీస్ అమరవీరుల సంస్మరణ సందర్భంగా హసన్‌పర్తి సీఐ మహేందర్ ఆధ్వర్యంలో మడికొండలోని రాజరాజేశ్వరి ఫంక్షన్ హాల్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు.విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీసు అమరవీరులకు నివాళులర్పిస్తూ,వారి సేవలను స్మరించుకునే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందక ప్రాణాలూ కోల్పోకూడదనే లక్ష్యంతో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు.రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడవచ్చని,ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని నిర్వాహకులు సూచించారు.పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడంతో పాటు సమాజ సేవలో భాగస్వాములు కావడం అభినందనీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సుధన్ పల్లి గ్రామ సర్పంచ్ లక్ష్మిలింగస్వామి,హసన్‌పర్తి మండల ఉపసర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు ఆళ్ల దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబాన్ని పరామర్శించిన కందుల సంధ్యారాణి పోశం



**రామగిరి, జోర్దార్ ప్రతినిధి:**రామగిరి మండలం బేగంపేట గ్రామానికి చెందిన ముత్తె అరవింద్ కళ్యాణ్ గురువారం హనుమకొండలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర ఓబీసీ ఉపాధ్యక్షురాలు, పెరిక సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కందుల సంధ్యారాణి పోశం బేగంపేట గ్రామానికి వెళ్లి మృతుడి తండ్రి, సాయి ప్రగతి పాఠశాల కరస్పాండెంట్ ముత్తె కళ్యాణి చంద్రమౌళిని పరామర్శించారు. అనంతరం అరవింద్ కళ్యాణ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

సంధ్యారాణి వెంట బేగంపేట ఉపసర్పంచ్ సందెల రేణుక కుమారస్వామి,

గోవిందుల ఆనంద్, బొడ్డు రవీందర్, బత్తుల రమేష్, దుండే రాజేందర్, అంకతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో సైకిల్ ర్యాలీ

**హుజూరాబాద్,(జోర్దార్ ప్రతినిధి)**పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం 6:30 గంటలకు హుజూరాబాద్ ఏసీపీ మాధవి ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ నిర్వహించనున్నట్లు హుజూరాబాద్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఈ ర్యాలీలో యువతీ యువకులు, విద్యార్థులు, సైక్లింగ్ ఆసక్తి ఉన్నవారు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఆసక్తి ఉన్నవారు సోమవారం ఉదయం హుజూరాబాద్ పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ర్యాలీని విజయవంతం చేయాలని ఇన్‌స్పెక్టర్ విజ్ఞప్తి చేశారు.

# మూడు దశాబ్దాల విశ్వవిద్యాలయ సేవకు గుర్తింపు ఏది?

- కొత్త నియామకాలకు ముందు యూనివర్సిటీ కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లకు న్యాయం జరగదా?

తెలంగాణ రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో గత మూడు దశాబ్దాలుగా విద్యాబోధన, పరిశోధన, విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల జీవితాల్లో నేడు ఒక ప్రశ్నార్థకం నెలకొంది. ఇన్ని సంవత్సరాల సేవకు ప్రతిఫలం ఏమిటి? విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దిన అధ్యాపకుల భవిష్యత్తుకు భరోసా ఎవరు కల్పిస్తారు?

రాష్ట్రంలో విశ్వవిద్యాలయ అధ్యాపక నియామకాల కోసం ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయడానికి సిద్ధమవుతున్న నేపథ్యంలో, ఉన్నత విద్యారంగంలో ఒక కీలకమైన చర్చ జరగాల్సిన అవసరం ఉంది. కొత్త నియామకాలను చేపట్టడం తప్పు కాదు. ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేయడం అత్యవసరమే. అర్హులైన నిరుద్యోగ అభ్యర్థులకు ఉద్యోగావకాశాలు కల్పించడం కూడా ప్రభుత్వ బాధ్యతే. అయితే, అదే సమయంలో దశాబ్దాలుగా విశ్వవిద్యాలయాల అభివృద్ధికి సేవలందించిన కాంట్రాక్ట్ అధ్యాపకుల భవిష్యత్తును కూడా ప్రభుత్వం బాధ్యతతో పరిగణించాల్సిన అవసరం లేదా?

### మూడు దశాబ్దాల సేవకు విలువ లేదా?

ఒక అధ్యాపకుడు తన జీవితంలో అత్యంత విలువైన సంవత్సరాలను విశ్వవిద్యాలయానికి అంకితం చేశాడనుకుందాం. తరగతి గదిలో విద్యాబోధన చేశాడు. విద్యార్థులకు మార్గదర్శకత్వం వహించాడు. పరీక్షల నిర్వహణలో పాల్గొన్నాడు. పరిశోధనలకు సహకరించాడు. ఎన్నో తరాల విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోవడంలో తన వంతు పాత్ర పోషించాడు.

కానీ అదే అధ్యాపకుడు తన ఉద్యోగ భవిష్యత్తు గురించి నేటికీ అనిశ్చితిలో జీవించాల్సి వస్తే, అది కేవలం ఒక ఉద్యోగ సమస్య మాత్రమే కాదు. అది ఉన్నత విద్యా వ్యవస్థలో దీర్ఘకాలిక సేవకు ఇచ్చే గుర్తింపు గురించి ఆలోచించాల్సిన అంశం. ముప్పై సంవత్సరాల అనుభవం ఉన్న అధ్యాపకుడి జీవితంలో స్థిరత్వం, కుటుంబ భద్రత, పదవీ విరమణ అనంతర భవిష్యత్తు వంటి అంశాలకు ఎంతో ప్రాధాన్యం ఉంటుంది. అటువంటి సమయంలో తన భవిష్యత్తుపై స్పష్టత లేకుండా పనిచేయాల్సి రావడం ఎంతటి ఆందోళనకు దారితీస్తుందో సమాజం అర్థం చేసుకోవాలి.ఇప్పటికి 35 మంది కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్స్ మరణించారు, వారి కుటుంబాలకు మాత్రం ఎలాంటి న్యాయం జరగలేదు.

### నియామకాలు స్వాగతించదగినవే... కానీ న్యాయం మాటేమిటి?

విశ్వవిద్యాలయాల్లో ఖాళీల భర్తీకి ప్రభుత్వం చర్యలు తీసుకోవడం స్వాగతించదగిన పరిణామం. అయితే కొత్త నియామకాల ప్రక్రియ ప్రారంభమవుతున్నప్పుడు, ఇప్పటికే అక్కడ పనిచేస్తున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లకు సంబంధించిన సమస్యలను కూడా సమాంతరంగా పరిష్కరించే ప్రయత్నం జరగాలి. కొత్త ఉద్యోగార్థులకు అవకాశాలు కల్పించడం ఎంత ముఖ్యమో, ఇప్పటికే దశాబ్దాలుగా సేవలందించిన అధ్యాపకుల సమస్యలను న్యాయబద్ధంగా పరిశీలించడం కూడా అంతే ముఖ్యం.

ప్రస్తుత నియామక ప్రక్రియలో తమ భవిష్యత్తుకు సంబంధించి ఎలాంటి స్పష్టమైన హామీ లేదా పరిష్కార మార్గం కనిపించడం లేదని కాంట్రాక్ట్ అధ్యాపకులు ఆందోళన వ్యక్తం చేస్తే, ప్రభుత్వం దానిని గంభీరంగా పరిగణించాలి. వారి అర్హతలు, నియామక విధానం, దీర్ఘకాలిక సేవ, వర్తించే చట్టాలు, న్యాయస్థానాల తీర్పులను పరిగణనలోకి తీసుకుని స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలి.ఇది కొత్త అభ్యర్థులకు వ్యతిరేకంగా నిలబడే పోరాటం కాదు. ఇది రెండు వర్గాల ప్రయోజనాలను సమతుల్యం చేస్తూ, న్యాయం సాధ్యమయ్యే మార్గాన్ని అన్వేషించాల్సిన సందర్భం.

### ప్రభుత్వాల హామీలు -- ఆచరణలో ఏమైంది?

ప్రభుత్వాలు మారుతాయి. పాలకులు మారుతారు. ఎన్నికల సందర్భంగా ఉద్యోగుల సమస్యలు, కాంట్రాక్ట్ సిబ్బంది భవిష్యత్తు, సేవల గుర్తింపు వంటి అంశాలు చర్చకు వస్తుంటాయి. కానీ ఆ హామీలు ఆచరణలో ఎంతవరకు అమలవుతున్నాయన్నది ప్రజలు ప్రశ్నించాల్సిన అంశం.

తెలంగాణలో విశ్వవిద్యాలయ కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల విషయంలో గత ప్రభుత్వాలు ఏమి హామీ ఇచ్చాయి? ప్రస్తుత ప్రభుత్వం వారి సమస్య పరిష్కారం కోసం ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకుంది? కొత్త నియామకాలకు ముందు వారి సమస్యను పరిష్కరించడానికి ఏదైనా కార్యాచరణ ఉందా?

ఈ ప్రశ్నలకు ప్రభుత్వం స్పష్టమైన సమాధానాలు ఇవ్వాల్సిన అవసరం ఉంది. హామీలు కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా, చట్టపరమైన పరిమితులను గౌరవిస్తూ ఆచరణ సాధ్యమైన విధాన నిర్ణయాలుగా మారాలి.

### రెగ్యులరైజేషన్‌పై స్పష్టమైన విధానం అవసరం

కాంట్రాక్ట్ అధ్యాపకులందరినీ ఒకే విధంగా రెగ్యులరైజ్ చేయడం చట్టపరంగా సాధ్యమేనని ముందుగానే నిర్ణయించలేం. నియామకాల నేపథ్యం, అర్హతలు, వర్తించే చట్టాలు, న్యాయస్థానాల తీర్పులు వంటి అంశాలు పరిశీలించాల్సి ఉంటుంది. అయితే ఈ అంశాలు ఉన్నాయనే కారణంతో వారి సమస్యను నిరవధికంగా వాయిదా వేయడం కూడా సముచితం కాదు.

ప్రభుత్వం ముందుగా ఒక సమగ్ర సమీక్ష చేపట్టాలి. అర్హులైన దీర్ఘకాలిక కాంట్రాక్ట్ అధ్యాపకుల సేవలను ఎలా పరిగణించాలి? వారికి చట్టబద్ధంగా ఏ విధమైన రక్షణ లేదా ప్రయోజనాలు కల్పించవచ్చు? ప్రస్తుత నియామక ప్రక్రియలో వారి పరిస్థితిని ఎలా పరిగణనలోకి తీసుకోవచ్చు? అనే అంశాలపై నిపుణుల కమిటీ లేదా సంబంధిత అధికారులతో సంప్రదింపులు జరిపి, నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కార మార్గాన్ని ప్రకటించాలి.

### ఇది ఉద్యోగుల సమస్య మాత్రమే కాదు -- విశ్వవిద్యాలయాల భవిష్యత్తు కూడా!

విశ్వవిద్యాలయాలు భవనాలతో, ప్రయోగశాలలతో, నియామకాలతో మాత్రమే అభివృద్ధి చెందవు. వాటి అభివృద్ధికి అధ్యాపకుల అనుభవం, బోధనా నైపుణ్యం, పరిశోధనా దృక్పథం, విద్యార్థులతో ఏర్పడిన అనుబంధం కూడా కీలకం. సుదీర్ఘకాలం పనిచేసిన అధ్యాపకుల భవిష్యత్తు అనిశ్చితిలో ఉంటే, అది వారి వ్యక్తిగత జీవితాలపైనే కాకుండా విశ్వవిద్యాలయాల్లో ఉద్యోగ భద్రత, సంస్థాగత స్థిరత్వం, అధ్యాపకుల మనోధైర్యం వంటి అంశాలపై కూడా ప్రభావం చూపవచ్చు. అందువల్ల ఈ సమస్యను కేవలం కొంత మంది ఉద్యోగుల డిమాండ్‌గా కాకుండా, ఉన్నత విద్యా వ్యవస్థలో బాధ్యతాయుతమైన ఉపాధి విధానం అవసరమనే కోణంలో చూడాలి. ముప్పై సంవత్సరాల సేవ అనేది కేవలం క్యాలెండర్‌లో గడిచిన కాలం కాదు. అది వేలాది తరగతులు, లక్షలాది బోధనా గంటలు, విద్యార్థుల జీవితాల్లో నాటిన జ్ఞానపు విత్తనాలు, ఒక సంస్థ అభివృద్ధికి చేసిన నిరంతర కృషి. ఆ సేవకు గుర్తింపు ఇవ్వడం అంటే తప్పనిసరిగా చట్టపరమైన విధానాలను పక్కనపెట్టి నియామకాలు చేయడం కాదు. అర్హతలు, చట్టాలు, న్యాయసూత్రాలకు అనుగుణంగా వారి సమస్యను పరిష్కరించేందుకు నిజాయితీతో కూడిన ప్రయత్నం చేయాలి.

**ప్రొఫెసర్ నాగయ్య**
**కాకతీయ విశ్వవిద్యాలయం వరంగల్**

## మృతుని కుటుంబానికి ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆర్థిక సాయం

- కుటుంబ సభ్యులను పరామర్శించి, మృతికి గల కారణాలపై ఆరా



**(వీణవంక జోర్దార్ ప్రతినిధి)**వీణవంక మండలం కిష్టంపేట గ్రామానికి చెందిన ఉడుత సునీల్ ఇటీవల మృతి చెందడంతో, ఆయన కుటుంబాన్ని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పరామర్శించారు. మృతుని కుటుంబ సభ్యులకు రూ.10 వేల ఆర్థిక సాయం అందజేసి, సునీల్ మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సిద్దపల్లి మహిపాల్ రెడ్డి, ముసుపట్ల తిరుపతి రెడ్డి, మవురం విజయభాస్కర్ రెడ్డి, మనోహర్, కామిడి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బహుజన ఆత్మగౌరవానికి ప్రతీక సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్



- హనుమకొండ కాకతీయ గౌడ హాస్టల్‌లో ఘనంగా విగ్రహావిష్కరణ
- పాపన్న గౌడ్ పోరాట స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలి: కత్తి వెంకటస్వామి గౌడ్

**హనుమకొండ జోర్దార్ ప్రతినిధి:**బహుజనుల ఆత్మగౌరవం, సమానత్వం, సామాజిక హక్కుల కోసం పోరాడిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని కాంగ్రెస్ ఓబీసీ సెల్ జాతీయ కన్వీనర్ కత్తి వెంకటస్వామి గౌడ్ పిలుపునిచ్చారు. బహుజనులంతా ఐక్యంగా ముందుకు సాగుతూ సమాజ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. హనుమకొండ హంటర్ రోడ్డులోని కాకతీయ గౌడ హాస్టల్‌లో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని శనివారం విగ్రహ నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కత్తి వెంకటస్వామి గౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరించి పాపన్న గౌడ్ సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బహుజనుల ఆత్మగౌరవం, హక్కులు, సామాజిక పురోగతి కోసం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చేసిన పోరాటం చరిత్రలో చిరస్మరణీయమన్నారు. ఆయన జీవిత చరిత్రను యువత తెలుసుకోవడంతో పాటు, పోరాట స్ఫూర్తిని కొనసాగించాలని కోరారు. సమాజంలో ఐక్యత, సమానత్వం, సేవాభావాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. కాకతీయ గౌడ హాస్టల్‌లో పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ద్వారా ఆయన చరిత్ర, పోరాట స్ఫూర్తిని భావితరాలకు పరిచయం చేసే అవకాశం ఏర్పడిందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు, విగ్రహ నిర్మాణ కమిటీ సభ్యులు, యువకులు, ప్రజాప్రతినిధులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. కార్యక్రమంలో విగ్రహ నిర్మాణ కమిటీ సభ్యులు అనంతుల రమేష్ గౌడ్, జూలూరి రంజిత్ గౌడ్, మార్క రవి గౌడ్, కూనూరు రంజిత్ గౌడ్, డాక్టర్ సోల్తి కిరణ్ గౌడ్, మాచర్ల శరత్ గౌడ్‌తో పాటు గౌడ సంఘం నాయకులు పులి శ్రీనివాస్ గౌడ్, జనార్దన్ గౌడ్, మోహన్ గౌడ్, బొనగాని యాదగిరి గౌడ్, బైరి రవికృష్ణ గౌడ్, తీగల జీవన్ గౌడ్, స్వామి గౌడ్, అశోక్ గౌడ్, పెరుమాండ్ల వెంకట్ గౌడ్, టీవీ రాజ్ గౌడ్, యుగేందర్ గౌడ్, హరీష్ గౌడ్, జగన్ గౌడ్, మార్క విజయ్ కుమార్ గౌడ్, సంజయ్ గౌడ్, సోల్తి సారయ్య గౌడ్, ఏకాంతం గౌడ్, గోపి గౌడ్, రాంకీ గౌడ్, సాగర్ గౌడ్, విజయ్ గౌడ్, కుమార్ గౌడ్, తేజ తదితరులు పాల్గొన్నారు.

## వెస్ట్ ఆస్ట్రేలియా కరిక్యులంతో అల్ఫోర్స్ ఇంటర్నేషనల్ స్కూల్!

- నైపుణ్య ఆధారిత విద్యకు ప్రాధాన్యం.. త్వరలో నర్సరీ నుంచి రెండో తరగతి వరకు అంతర్జాతీయ విద్యా విధానం
- మార్కుల కోసం పిల్లలపై ఒత్తిడి తేవొద్దు.. అన్ని రంగాల్లో రాణించేలా ప్రోత్సహించాలి: అల్ఫోర్స్ అధినేత వి.నరేందర్ రెడ్డి




**(కరీంనగర్ జోర్దార్ ప్రతినిధి)**భారతీయ విద్యా వ్యవస్థ అకడమిక్ పరంగా ప్రపంచంలోనే అగ్రగామిగా ఉన్నప్పటికీ, నైపుణ్య ఆధారిత విద్యలో మరింత పురోగతి సాధించాల్సిన అవసరం ఉందని అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత వి.నరేందర్ రెడ్డి అభిప్రాయపడ్డారు. విద్యార్థులను కేవలం డాక్టర్లు, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కాకుండా, వారి ఆసక్తులు, అభిరుచులకు అనుగుణంగా వివిధ రంగాల్లో నైపుణ్యాలను పెంపొందించాలని సూచించారు. ఆస్ట్రేలియాలోని వెస్ట్ ఆస్ట్రేలియా విద్యా విధానాన్ని పరిశీలించిన నేపథ్యంలో, తల్లిదండ్రుల ఆసక్తికి అనుగుణంగా కరీంనగర్‌లో వెస్ట్ ఆస్ట్రేలియా కరిక్యులంతో అల్ఫోర్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌ను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.

### ఆస్ట్రేలియా విద్యా విధానంపై అధ్యయనం

విజయదశమి సందర్భంగా ఆస్ట్రేలియా పర్యటన విశేషాలను ఆయన మీడియాకు వివరించారు. అక్టోబర్ 17 నుంచి 22 వరకు వెస్ట్ ఆస్ట్రేలియాలో పర్యటించి, పలు విశ్వవిద్యాలయాలు, పాఠశాలలను సందర్శించినట్లు తెలిపారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన 12 మంది విద్యారంగ ప్రముఖులతో కలిసి అక్కడి విద్యా విధానం, పాఠ్యప్రణాళిక, ఉపాధి అవకాశాలను అధ్యయనం చేసినట్లు పేర్కొన్నారు.

### నైపుణ్య విద్యతోనే ఉపాధి అవకాశాలు

దేశంలో విద్య ప్రధానంగా వైద్య, సాఫ్ట్‌వేర్ రంగాల చుట్టూనే తిరుగుతోందని నరేందర్ రెడ్డి అన్నారు. ప్రతి విద్యార్థి ఈ రంగాల్లోనే స్థిరపడాలనే ఆలోచనతో ముందుకు సాగడం వల్ల ఇతర రంగాల్లోని అవకాశాలను గుర్తించలేకపోతున్నారని పేర్కొన్నారు. సాంకేతిక, వృత్తి విద్య, నైపుణ్య ఆధారిత కోర్సులకు తగిన ప్రాధాన్యం ఇవ్వకపోవడం వల్ల ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవడంలో వెనుకబడుతున్నామని వివరించారు. ఆస్ట్రేలియాలో బైపీసీ, ఎంపీసీలతో పాటు సీఈసీ, ఎంఈసీ, పశువైద్యం, కళలు, సంగీతం, క్రీడలు వంటి విభిన్న రంగాలకు సమాన ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. విద్యార్థులపై చదువుల ఒత్తిడి తగ్గిస్తూ, వారు ఎంచుకున్న రంగంలో ప్రతిభను ప్రదర్శించేలా ప్రోత్సహించడం అక్కడి విద్యా విధానంలోని ప్రత్యేకత అని వివరించారు.

### 12వ తరగతి వరకు ఒకే విద్యా విధానం

వెస్ట్ ఆస్ట్రేలియాలో నర్సరీ నుంచి 12వ తరగతి వరకు కొనసాగుతున్న విద్యా విధానాన్ని ఆయన ప్రస్తావించారు. మధ్యలో బోర్డు పరీక్షల ఒత్తిడి లేకుండా, అంతర్గత మూల్యాంకనానికి కూడా ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని నిరంతరం అంచనా వేయడం ద్వారా వారిపై పరీక్షల ఒత్తిడిని తగ్గించవచ్చని అభిప్రాయపడ్డారు.తెలంగాణలోనూ పాఠశాల విద్య, జూనియర్ కళాశాలల వ్యవస్థపై జరుగుతున్న చర్చల నేపథ్యంలో ఇలాంటి విధానం ప్రయోజనకరంగా ఉంటుందని పేర్కొన్నారు. అక్కడ ఎనిమిదో తరగతి నుంచే బిజినెస్ మేనేజ్‌మెంట్, ఎకనామిక్స్, అగ్రికల్చర్ సైన్స్, స్పోర్ట్స్ వంటి అంశాలను ఎంచుకునే అవకాశం విద్యార్థులకు ఉంటుందని వివరించారు.

మైనర్ పిల్లల ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసే విషయంలోనూ ఆస్ట్రేలియాలో కఠినమైన చట్టపరమైన నిబంధనలు ఉన్నాయని తెలిపారు.

### అల్ఫోర్స్‌లో అంతర్జాతీయ కరిక్యులం

వెస్ట్ ఆస్ట్రేలియా విద్యా విధానంలోని ప్రత్యేకతలను స్థానిక విద్యార్థులకు అందించాలనే లక్ష్యంతో అల్ఫోర్స్ విద్యా సంస్థల్లో అంతర్జాతీయ పాఠ్యప్రణాళికను ప్రవేశపెట్టనున్నట్లు నరేందర్ రెడ్డి ప్రకటించారు.

ఇందుకు సంబంధించిన ప్రభుత్వ అనుమతుల ప్రక్రియ తుది దశకు చేరుకున్నట్లు తెలిపారు.

రాబోయే విద్యా సంవత్సరంలో నర్సరీ నుంచి రెండో తరగతి వరకు వెస్ట్ ఆస్ట్రేలియా కరిక్యులంతో తరగతులను ప్రారంభించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు.

పిల్లల ఆసక్తులకు అనుగుణంగా ప్రోత్సహించాలి తల్లిదండ్రులు పిల్లలపై మార్కుల కోసం ఒత్తిడి తీసుకురావద్దని నరేందర్ రెడ్డి సూచించారు. ఐఐటీ, వైద్య విద్యతో పాటు క్లాట్, చార్టర్డ్ అకౌంటెన్సీ, వ్యవసాయం, క్రీడలు వంటి రంగాల్లోనూ ఉన్నత అవకాశాలు ఉన్నాయని, పిల్లల ఆసక్తులను గుర్తించి ఆయా రంగాల్లో రాణించేలా ప్రోత్సహించాలని కోరారు.

విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణాన్ని కల్పించేందుకు విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాలు, డిజిటల్ బోర్డులు, ప్రయోగశాలలను మరింత ఆధునీకరిస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

RNI NO.TGTEL/25/A5224
జోర్దార్
JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక
అవినీతి అంతం - మా పంతం


# బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కనుమల గణపతి

- నియామకంపై జిల్లా, స్థానిక నాయకుల హర్షం.. ఘన సన్మానం



**(కరీంనగర్ జోర్దార్ ప్రతినిధి)**భారతీయ జనతా పార్టీ (బీజేపీ) కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన కనుమల గణపతికి జిల్లా, స్థానిక బీజేపీ నాయకులు హార్దిక శుభాకాంక్షలు తెలియజేస్తూ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కనుమల గణపతి మాట్లాడుతూ.. కరీంనగర్ జిల్లాలో పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తానని తెలిపారు. పార్టీ తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, ప్రజలకు మరింత చేరువయ్యేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.
తన నియామకానికి సహకరించిన కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం, మాజీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్, అంకుశాపూర్ గ్రామ సర్పంచ్ కవిడే కుమారస్వామి, పొన్నగంటి రవికుమార్, టంగుటూరి రాజ్‌కుమార్, ఆవుల తిరుపతి, దుర్గం సతీష్, పనికరి రమేష్, బోనగిరి ప్రణీత్, పొట్టాల మల్లేష్, దయ్యాల ప్రభాకర్, సిరియాల విజయ్ పటేల్ తదితరులు పాల్గొని కనుమల గణపతికి శుభాకాంక్షలు తెలిపారు.

# ఆదిలాబాద్‌లో పోలీసుల సైకిల్ ర్యాలీ



**ఆదిలాబాద్,జోర్దార్ ప్రతినిధి:**పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవ కార్యక్రమంలో భాగంగా శనివారం సాయంత్రం ఆదిలాబాద్ పోలీస్ సిబ్బంది భారీ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సైకిల్ ర్యాలీని ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రారంభించారు. పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. వారి త్యాగాలను ప్రతి ఒక్కరు స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఏఎస్పీలు మౌనిక, సురేందర్, డీఎస్పీ జీవన్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

# వ్యవసాయంలో డ్రోన్లతో సమయం ఖర్చు ఆదా!

- తక్కువ సమయంలోనే మందుల పిచికారీ.. రైతులకు ఎంతో ప్రయోజనం
- వ్యవసాయ డ్రోన్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



**(మొగుళ్లపల్లి జోర్దార్ ప్రతినిధి)**ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వ్యవసాయ రంగంలో వినియోగించుకోవడం ద్వారా రైతులకు సమయం, ఖర్చు ఆదా కావడంతో పాటు మెరుగైన ఫలితాలు సాధించవచ్చని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. వ్యవసాయంలో డ్రోన్ల వినియోగం రైతులకు ఎంతో ప్రయోజనకరమని పేర్కొన్నారు. భూపాలపల్లి నియోజకవర్గంలోని మొగుళ్లపల్లి మండల రైతు వేదికలో సీఎస్ఆర్ నిధులతో అందించిన వ్యవసాయ డ్రోన్ పరికరాన్ని శనివారం ఆయన ప్రారంభించారు.

**రైతులకు ఆధునిక సాంకేతికతతో మేలు**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వ్యవసాయ డ్రోన్ల ద్వారా తక్కువ సమయంలో పంటలకు పురుగుమందులు, ఎరువులను సమర్థవంతంగా పిచికారీ చేయవచ్చని తెలిపారు.
సంప్రదాయ పద్ధతులతో పోలిస్తే శ్రమ తగ్గడంతో పాటు నీరు, సమయం ఆదా అవుతాయని వివరించారు. రైతులు నేరుగా పురుగుమందులతో సంబంధంలోకి వెళ్లాల్సిన అవసరం తగ్గడం వల్ల ఆరోగ్యపరమైన ప్రమాదాలను కూడా తగ్గించవచ్చన్నారు. వ్యవసాయంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించుకోవాలని రైతులకు సూచించారు.

**కార్యక్రమంలో పలువురు నాయకులు**

ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సంపెల్లి నరసింగరావు, వ్యవసాయ అధికారి సురేందర్‌రెడ్డి, డైరెక్టర్లు, భూపాలపల్లి మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, చిట్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ గుమ్మడి శ్రీదేవి, స్థానిక సర్పంచి చాట్ల విజయ రవీందర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రఫీ, జిల్లా నాయకులు తక్కళ్లపల్లి రాజు, ఎలేటి శివారెడ్డి, టౌన్ అధ్యక్షుడు కేతరాజు రమేష్, కాంగ్రెస్ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# దరియాపూర్ మోడల్ స్కూల్‌లో ఘనంగా ఐక్యరాజ్యసమితి దినోత్సవం

- విద్యార్థులకు అవగాహన..
- ఎన్ఎంఎంఎస్ పుస్తకాల పంపిణీ





**ముత్తారం జోర్దార్:**పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం దరియాపూర్‌లోని తెలంగాణ మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కళాశాలలో ఐక్యరాజ్యసమితి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రపంచ శాంతి, సమాజ సేవ, స్వామి వివేకానంద చికాగో సందేశ స్ఫూర్తి, సత్ప్రవర్తనపై విద్యార్థులకు అవగాహన కల్పించడంతో పాటు, జాతీయ ప్రతిభా ఉపకార వేతన పరీక్షకు సిద్ధమవుతున్న ఎనిమిదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక పుస్తకాలను పంపిణీ చేశారు.గాంధీ స్మారక నిధి తెలంగాణ, జాతీయ యువజన ప్రాజెక్టు, నిఫా ఆధ్వర్యంలో నిర్వహించిన ఐక్యరాజ్యసమితి దినోత్సవ కార్యక్రమానికి జాతీయ యువజన ప్రాజెక్టు రాష్ట్ర సమన్వయకర్త యాదవరాజు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రపంచ శాంతి, అంతర్జాతీయ సహకారం, మానవ హక్కులు, సమానత్వం, సహనం, దేశాల మధ్య స్నేహభావాన్ని పెంపొందించడంలో ఐక్యరాజ్యసమితి పోషిస్తున్న పాత్రను వివరించారు. విద్యార్థులు శాంతి, సౌభ్రాతృత్వం, సేవా భావం, మానవతా విలువలను అలవరచుకొని బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని సూచించారు. ప్రపంచ సమస్యల పరిష్కారంలో ఐక్యరాజ్యసమితి ప్రాధాన్యతతో పాటు యువత పాత్రను వివరించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేసరి సంతోష్ కుమార్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ప్రపంచ పౌరసత్వ భావన, సామాజిక బాధ్యత, మానవతా విలువలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. అనంతరం ఎనిమిదో తరగతి విద్యార్థులు జాతీయ ప్రతిభా ఉపకార వేతన పరీక్ష (ఎన్ఎంఎంఎస్)లో ఉత్తమ ఫలితాలు సాధించే లక్ష్యంతో రూపొందించిన స్వల్పకాలిక పరీక్షా సన్నద్ధత పుస్తకాలను మాజీ జెడ్పీటీసీ చొప్పరి సదానందం, దరియాపూర్ గ్రామ సర్పంచ్ రాపల్లి రాజయ్య పంపిణీ చేశారు. తక్కువ సమయంలో పరీక్షలకు సమర్థవంతంగా సిద్ధమయ్యేందుకు ఈ పుస్తకాలు ఎంతగానో ఉపయోగపడతాయని వారు తెలిపారు.ఈ కార్యక్రమాల్లో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించిన సంస్థల ప్రతినిధులకు పాఠశాల యాజమాన్యం కృతజ్ఞతలు తెలిపింది.

# జోర్దార్ వార్తకు స్పందించిన కరీంనగర్ జిల్లా కలెక్టర్

## ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి భరోసా కల్పించాలి

- జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా..
- జీజీహెచ్‌లో క్షేత్రస్థాయి పరిశీలన..
- మరమ్మతుల నాణ్యతపై ఆరా

**(కరీంనగర్: జోర్దార్ ప్రతినిధి)**కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో అసౌకర్యాలపై జోర్దార్ తెలుగు దినపత్రిక వరుస కథనాలపై జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రా స్పందించారు కాలం చెల్లిన వాటర్ ట్యాంక్ నీళ్ల వల్ల ఆసుపత్రి రోగులు అనారోగ్యం పాలైన విషయం జోర్దార్ పత్రిక వెలుగులోకి తెచ్చింది అదేవిధంగా హుజూరాబాద్ ఆసుపత్రికి బదిలీ అయినా ఒక ఆర్ ఎం ఓ అడ్డదారిన కరీంనగర్ ఆస్పత్రిలో డ్యూటీ చేస్తూ ఇతర సిబ్బందిని నరకయాతన గురించి చేసిన అంశంపై కూడా జోర్దార్ తెలుగు దినపత్రిక వెలుగులోకి తీసుకొని రావడంతో ప్రభుత్వము విచారణకు ఆదేశించింది. శనివారం కలెక్టర్ తనిఖీ చేయడంతో రోగుల హర్షం వ్యక్తం చేశారు
శనివారం కరీంనగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీజీహెచ్)ను సందర్శించి, వార్డుల నుంచి మరమ్మతు పనుల వరకు క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

**రోగుల అనుభవాలే ప్రాధాన్యం..**

ఆసుపత్రిలో వైద్య సేవలు ఎలా అందుతున్నాయో తెలుసుకునేందుకు కలెక్టర్ నేరుగా రోగులతో మాట్లాడారు. ఎంఎన్‌డబ్ల్యు యూనిట్, మహిళా వార్డు, ఓపీ, సర్జికల్ తదితర విభాగాలను సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. రోగులకు అందుతున్న చికిత్స, సదుపాయాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ వీరారెడ్డి, ఆర్ఎంఓ నవీనతో కలిసి వార్డులను పరిశీలించిన ఆమె.. రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా వైద్యులు, సిబ్బంది బాధ్యతతో విధులు నిర్వహించాలని సూచించారు. ఆసుపత్రిలో పరిశుభ్రతకు నిరంతరం ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు.









**మరమ్మతుల్లో నాణ్యతే గీటురాయి**

రోగులకు మెరుగైన వసతులు కల్పించేందుకు చేపడుతున్న మరమ్మతు పనులు నిర్దేశిత ప్రమాణాలతో సాగాలని కలెక్టర్ సూచించారు. టీజీఎంఐడీసీ అధికారులను వివరాలు అడిగి తెలుసుకుని, ప్యాచ్‌వర్క్‌లు, మరుగుదొడ్ల మరమ్మతులు, గదులు, కిటికీలకు సంబంధించిన పనులను పరిశీలించారు.

**ఆధునిక వైద్య సదుపాయాలు అందుబాటులోకి రావాలి**

గుండె సంబంధిత వ్యాధిగ్రస్తులకు మెరుగైన చికిత్స అందించేందుకు సుమారు రూ. 6.5 కోట్లతో ఏర్పాటు చేసిన క్యాత్ ల్యాబ్ మిషన్లు, క్రిటికల్ కేర్ సెంటర్‌ను కలెక్టర్ పరిశీలించారు. వీటిని పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకొచ్చేందుకు అవసరమైన ఏర్పాట్లపై వైద్యాధికారులతో చర్చించారు. చికిత్స కోసం ఆసుపత్రులకు వచ్చే రోగుల సహాయకులు ఎదుర్కొనే ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని మాతా శిశు ఆరోగ్య కేంద్రం ఆవరణలో రూ. 35 లక్షలతో ఏర్పాటు చేయనున్న విశ్రాంతి గదుల షెడ్డు పనులను కలెక్టర్ పరిశీలించారు. మున్సిపల్ అధికారులకు పలు సూచనలు చేస్తూ, రోగుల సహాయకులకు ఉపయోగపడేలా సదుపాయాలు కల్పించాలని తెలిపారు. ఆసుపత్రిలో వైద్య సేవలు, పరిశుభ్రత, మౌలిక వసతులు, ఆధునిక చికిత్సా సదుపాయాల వినియోగం.. ఇలా ప్రతి అంశాన్ని పరిశీలించిన కలెక్టర్, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని సూచించారు. కలెక్టర్ వెంట జీజీహెచ్ సూపరింటెండెంట్ వీరారెడ్డి, ఆర్ఎంఓ నవీన, వైద్య సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# కాకతీయ టెక్స్‌టైల్ పార్క్‌లో వసతులపై కలెక్టర్ సమీక్ష



**వరంగల్,(జోర్దార్ ప్రతినిధి)**కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్‌లో కార్మికులు, పరిశ్రమలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనపై జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సమీక్ష నిర్వహించారు. కార్మికులకు కల్పించాల్సిన సౌకర్యాలు, అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులతో చర్చించి వివరాలు తెలుసుకున్నారు.ఈ సమావేశంలో ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, అదనపు కలెక్టర్ ఎల్. కిషోర్ కుమార్, ఆర్డీవోలు సుమ,ఉమారాణి, సంగెం తహసీల్దార్ రాజ్ కుమార్, ఆర్టీసీ డీఎం ధరమ్ సింగ్, జోనల్ మేనేజర్ స్వామి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# అధికారులు సమన్వయంతో పనిచేయాలి

- మండల సమన్వయ, సమీక్ష సమావేశంలో డీసీఓ మోహన్ సూచన




**హసన్‌పర్తి,జోర్దార్ ప్రతినిధి:**ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని మండల ప్రత్యేక అధికారి, డీసీఓ మోహన్ సూచించారు. హసన్‌పర్తి మండల కేంద్రంలో ఎంపీడీవో సుమన వాణి ఆధ్వర్యంలో మండల సమన్వయ, సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశానికి డీసీఓ మోహన్ అధ్యక్షత వహించి వివిధ శాఖల పనితీరు, అభివృద్ధి పనుల పురోగతి, ప్రభుత్వ పథకాల అమలుపై సమీక్షించారు. గ్రామాల్లోని సమస్యలను గుర్తించి వాటిని త్వరగా పరిష్కరించాలని, ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రజలకు అందేలా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచాలని ఆయన సూచించారు. తాగునీరు, విద్య, వైద్యం, వ్యవసాయం, మౌలిక వసతులు, మహిళా--శిశు సంక్షేమం తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. పెండింగ్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని, విధుల్లో నిర్లక్ష్యానికి తావులేకుండా పనిచేయాలని ఆదేశించారు. ఇదే సందర్భంగా గ్రామాల్లోని చెరువులు, కుంటల వినియోగానికి సంబంధించి గ్రామపంచాయతీలకు రావాల్సిన బకాయిలపై సర్పంచులు డిప్యూటీ తహసీల్దార్ సుమన్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సంబంధిత రికార్డులను పరిశీలించి బకాయిల వివరాలను తెలుసుకుని అవసరమైన చర్యలు తీసుకుంటామని సుమన్ తెలిపారు. ఈ సమావేశంలో మండలంలోని సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. శాఖల మధ్య సమన్వయంతో పనిచేసినప్పుడే ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ఫలాలు ప్రజలకు పూరిస్థాయిలో అందుతాయని డీసీఓ మోహన్ పేర్కొన్నారు.

# నిర్ణీత గడువులోగా రైల్వే ఫ్లైఓవర్ పనులు పూర్తి చేయాలి

**వారం రోజుల్లో ఆస్తులు కోల్పోయిన వారికి పరిహారం**



**వికారాబాద్,(జోర్దార్ ప్రతినిధి):**వికారాబాద్ పట్టణంలో నిర్మిస్తున్న రైల్వే ఫ్లైఓవర్ పనులను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని తెలంగాణ శాసనసభ స్పీకర్, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్ అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టర్ దీపక్ తివారితో కలిసి ఆయన ఫ్లైఓవర్ నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, పురోగతిని సమీక్షించారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనుల్లో జాప్యం జరగకుండా చూడాలని సూచించారు.ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తయితే పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు తగ్గి, ప్రజలకు రాకపోకలు సులభతరమవుతాయని పేర్కొన్నారు. నిర్మాణ సమయంలో ప్రజలకు రవాణా ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఫ్లైఓవర్ నిర్మాణం కోసం ఆస్తులు కోల్పోయిన వారికి వారం రోజుల్లోగా పరిహారం చెల్లించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు స్పీకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వాసు చంద్ర, డీసీసీబీ డైరెక్టర్ కిషన్ నాయక్, మున్సిపల్ వైస్ చైర్మన్ అర్థ సుధాకర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ ముదిరాజ్, ఆర్అండ్‌బీ ఈఈ శ్రీధర్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఖైదీలకు ఉచిత న్యాయ సేవలపై అవగాహన సదస్సు




**హుజురాబాద్,(జోర్దార్ ప్రతినిధి)**నిరుపేద ఖైదీలకు న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచితంగా న్యాయ సహాయం అందిస్తామని హుజురాబాద్ న్యాయమూర్తి పి.బి. కిరణ్ కుమార్ తెలిపారు. శనివారం హుజురాబాద్ సబ్‌జైలులో ఖైదీలకు న్యాయ విజ్ఞాన అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత న్యాయ సహాయం పొందడం రాజ్యాంగబద్ధమైన హక్కు అని పేర్కొన్నారు. ఉచిత న్యాయవాది సేవలు, బెయిల్ పొందే విధానాలు, లోక్ అదాలత్ ద్వారా న్యాయం పొందే అవకాశాలను వివరించారు. ఖైదీలు అడిగిన పలు న్యాయపరమైన సందేహాలను నివృత్తి చేశారు.ఈ కార్యక్రమంలో సబ్‌జైలు పర్యవేక్షణ అధికారి పి. శ్రీనివాస్, అసిస్టెంట్ డిప్యూటీ జైలర్ పి. సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# భూ వివాదం.. హత్యాయత్నం కేసులో తొమ్మిది మంది అరెస్ట్



**చేవెళ్ల,(జోర్దార్ ప్రతినిధి):**షాబాద్ మండలం హైతాబాద్‌లో భూ వివాదం నేపథ్యంలో జరిగిన ఘర్షణపై నమోదైన హత్యాయత్నం కేసులో తొమ్మిది మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. సర్వే నంబర్ 202 భూమి విషయంలో రెండు వర్గాల మధ్య చాలాకాలంగా వివాదం కొనసాగుతోంది. అక్టోబర్ 23న మసీదులో చర్చల సందర్భంగా ఘర్షణ చోటుచేసుకుంది. ఈ ఘటనలో చాంద్ పాషా, ఆయన కుమారులు సోహెల్, ఫైజల్‌పై దాడి జరిగినట్లు పోలీసులు తెలిపారు. నిందితులు కార్లు, బైక్‌లపై వచ్చి దాడికి పాల్పడినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఘటనకు సంబంధించి కార్లు, బైక్, కత్తి సహా పలు వస్తువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

# మృతుల కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే



**మొగుళ్ళపల్లి: జోర్దార్ ప్రతినిధి:**
జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలంలోని వివిధ గ్రామాలలో అనారోగ్య కారణాలతో మృతి చెందిన వారి కుటుంబాలను పరామర్శించి వారి కుటుంబాలకు మనోధైర్యాన్ని చెప్పి వారికి ఎల్లవేళలా ఎలాంటి సహకారమైనా అందిస్తానని భరోసా ఇచ్చిన భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్తన్న మండల కేంద్రానికి చెందిన గడ్డే భూమయ్య,బంగ్లా పల్లి గ్రామానికి చెందిన గోనెల ఓదెమ్మ ఎల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన నల్ల కనకమ్మ,దొడ్ల రాజయ్య, ఇస్సిపేట కొడారి కేతమ్మ పోతుగల్లు గ్రామంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ మాజీ అధ్యక్షులు బోల్లపల్లి చంద్రయ్య,కొరికిశాల గ్రామంలో మేదర వేణి రాజమ్మ కుటుంబాలను పరామర్శించిన భూపాలపల్లి ఎమ్మెల్యే , వారితో పాటు వివిధ గ్రామాల సర్పంచులు మండల పార్టీ అధ్యక్షులు గ్రామ శాఖ అధ్యక్షులు ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

RNI NO.TGTEL/25/A5224
జోర్దార్
JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక
అవినీతి అంతం - మా పంతం
ఆదివారం,
అక్టోబర్ 25 2026



# గ్రేటర్ వరంగల్ సిటీ ప్లానర్‌గా రవీంద్ర రెడేకర్

### జాయింట్ డైరెక్టర్‌గా పదోన్నతి.. జీడబ్ల్యూఎంసీలో పోస్టింగ్



**వరంగల్, అక్టోబర్ 24** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) సిటీ ప్లానర్‌గా రవీంద్ర రెడేకర్‌కు పోస్టింగ్ లభించింది. గతంలో వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఇన్‌చార్జి సిటీ ప్లానర్‌గా విధులు నిర్వహించిన ఆయన తాజాగా జాయింట్ డైరెక్టర్‌గా పదోన్నతి పొందారు. పదోన్నతి అనంతరం ప్రభుత్వం ఆయనను గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ సిటీ ప్లానర్‌గా నియమించింది. గతంలో ఇదే కార్పొరేషన్‌లో పనిచేసిన అనుభవం ఉన్న రవీంద్ర రెడేకర్ తిరిగి సిటీ ప్లానర్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు.

# జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కల సాకారం చేస్తాం

- న్యాయపరమైన చిక్కులు లేకుండా స్థలాల కేటాయింపునకు కార్యాచరణ
- జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

**రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి భరోసా**



**హైదరాబాద్, అక్టోబర్ 24**
రాష్ట్రంలో ఏళ్ల తరబడి ఇళ్ల స్థలాల కోసం ఎదురుచూస్తున్న జర్నలిస్టుల సొంతింటి కలను సాకారం చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి భరోసా ఇచ్చారు. న్యాయపరమైన చిక్కులు లేకుండా నివాసయోగ్యమైన ప్రాంతాల్లో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు అందించేందుకు ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోందని శనివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో 2008లో జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీకి భూములు కేటాయించినప్పటికీ న్యాయపరమైన సమస్యలతో ప్రక్రియ నిలిచిపోయిందని గుర్తుచేశారు. 2024 సెప్టెంబర్ 8న జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీకి భూమిని అప్పగించినప్పటికీ సుప్రీంకోర్టు తుది ఉత్తర్వుల నేపథ్యంలో మరోసారి న్యాయపరమైన చిక్కులు ఎదురయ్యాయని వివరించారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు సహచర మంత్రులతో పలుమార్లు చర్చించినట్లు తెలిపారు. గతంలో ఎదురైన న్యాయపరమైన సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. జర్నలిస్టులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారి సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో కీలక పాత్ర పోషిస్తున్న జర్నలిస్టులకు గౌరవప్రదమైన జీవనం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు.

# పరీక్షా కేంద్రాలను పరిశీలించిన అదనపు కలెక్టర్ రవి

### పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులకు ఆదేశం



**హసన్‌పర్తి, అక్టోబర్ 24** తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలిలో అసిస్టెంట్ సైంటిస్ట్ (అనలిస్ట్ గ్రేడ్--2) పోస్టుల భర్తీకి టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కంప్యూటర్ ఆధారిత నియామక పరీక్ష కేంద్రాలను హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి పరిశీలించారు. హసన్‌పర్తి మండలం ఎర్రగట్టుగుట్ట సమీపంలోని కిట్స్ కళాశాల, చింతగట్టు క్యాంప్ సమీపంలోని నోబెల్ టెక్నాలజీ అండ్ సొల్యూషన్స్ పరీక్షా కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లను సమీక్షించారు. పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించి, అభ్యర్థుల హాజరు వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పరీక్షలను పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహసీల్దార్ కిరణ్ కుమార్, అధికారులు పాల్గొన్నారు.

# ప్రజలకు పోలీసు సేవలు నిరంతరం అందుబాటులో ఉండాలి

- పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలి
- జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ ఆదేశం

**మహబూబాబాద్, అక్టోబర్ 24**
పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడి సమస్యపై తక్షణమే స్పందించి, ప్రజలకు పోలీసు సేవలు నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ అధికారులను ఆదేశించారు. శనివారం మహబూబాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన సిబ్బంది పనితీరు, కేసుల దర్యాప్తు పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఈ-కాప్స్, సీసీటీఎన్ఎస్, ఈ-సాక్ష్య, ఈ-సమ్మన్లు, ఎఫ్ఐఆర్‌ల నమోదు, రికార్డుల నిర్వహణపై సమీక్షించారు. పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించి, దర్యాప్తు నివేదికలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. కేసుల



వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నవీకరించాలని, దర్యాప్తులో పారదర్శకత, నాణ్యత పాటించాలని స్పష్టం చేశారు. ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరిస్తూ ప్రజలకు మెరుగైన



సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. ఈ తనిఖీలో రూరల్ ఎస్ఐ పిల్లల రాజు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ఎల్‌నినో ప్రభావంతో నీటి సంరక్షణకు ప్రాధాన్యం

### తక్కువ నీటితో పండే పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలి

### జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద దేవి



**నెక్కొండ, అక్టోబర్ 24**
ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశమున్నందున నీటి సంరక్షణకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద దేవి సూచించారు. శనివారం నెక్కొండ మండలం పత్తిపాక గ్రామంలో పర్యటించిన ఆమె ఉపాధి హామీ పనులను పరిశీలించి కూలీలు, రైతులతో మాట్లాడారు. భవిష్యత్తులో నీటి కొరత తలెత్తకుండా ఇంకుడు గుంతలు, సోక్‌పిట్లు, ఫామ్ పాండ్లు, బోరుబావుల రీఛార్జ్ నిర్మాణాలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రైతులు అధిక నీరు అవసరమయ్యే వరి సాగును తగ్గించి శనగలు, చిరుధాన్యాలు వంటి తక్కువ నీటితో పండే పంటలకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. గ్రామాల్లో నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపునకు ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం గ్రామంలోని ప్రాథమిక, ప్రీప్రైమరీ పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు బెంచీలు, మెరుగైన లైటింగ్ సౌకర్యాలు కల్పించాలని ఎంపీడీవో లావణ్యను ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ నాగ పద్మజ, జిల్లా పరిషత్ సీఈఓ వసంత తదితరులు పాల్గొన్నారు.

# మత్తు మందుల అక్రమ విక్రయాలపై టీజీ సేఫ్ కొరడా

**హైదరాబాద్, అక్టోబరు 24:** తెలంగాణలో మత్తు మందుల అక్రమ విక్రయాలపై టీజీ సేఫ్ కొరడా ఝుళిపించింది. హైదరాబాద్ క్యూర్ పరిధిలో పలు ప్రాంతాల్లో మెడికల్ షాపులపై అధికారులు (శనివారం) మెరుపు దాడులు నిర్వహించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులతో కలిసి డ్రగ్స్ వింగ్ అధికారులు తనిఖీలు చేపట్టారు. గాజులరామారం, కుత్బుల్లాపూర్, మల్కాజిగిరి, కాప్రా, హబ్సిగూడ, ఉప్పల్‌లో సోదాలు చేశారు. జీడిమెట్ల, బాలానగర్, మేడిపల్లి, షామీర్‌పేట్ జోన్లలోనూ రైడ్స్ నిర్వహించారు. ఈ నేపథ్యంలో హానికరమైన మాత్రల విక్రయాలపై అధికారులు నిఘాపెట్టారు. పలు రకాల మందులపై తనిఖీలు చేపట్టారు. ఆయా మందుల అక్రమ విక్రయాలపై ఆరా తీశారు. ఈ సోదాల్లో నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడిన 125 మెడికల్ షాపులను అధికారులు గుర్తించారు. సంబంధిత మెడికల్ షాపులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. లైసెన్సుల సస్పెన్షన్ లేదా రద్దుకు శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తెలంగాణలోని ఇతర జిల్లాల్లోనూ ప్రత్యేక తనిఖీలు కొనసాగుతున్నాయని అధికారులు పేర్కొన్నారు.

# రేటు పెంపులో అంతర్యమేంటి? ఈఎస్ఐ క్లీనింగ్ కాంట్రాక్టుపై అనుమానాలు

- రూ.10 నుంచి రూ.49.50కు పెంపు.. రెండు కమిటీల సిఫార్సులు బేఖాతర్?
- నాలుగు ఆస్పత్రుల పనులు ఒకే ఏజెన్సీకి నామినేషన్‌పై అప్పగింతపై ప్రశ్నలు
- ఏడాదికి రూ.29.25 కోట్ల అదనపు భారం పడే అవకాశం




**హైదరాబాద్ జోర్దార్ నిఘా విభాగం**
ఈఎస్ఐ ఆస్పత్రుల్లో క్లీనింగ్ కాంట్రాక్టు ధర పెంపు వ్యవహారం ఇప్పుడు తీవ్ర చర్చకు దారితీస్తోంది. చదరపు అడుగుకు రూ.10గా ఉన్న క్లీనింగ్ రేటును ఏకంగా రూ.49.50కు పెంచడం వెనుక కారణాలేమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా రేటు పెంపుపై అధ్యయనం చేసిన కమిటీలు సూచించిన మొత్తాలకు, చివరకు అమల్లోకి వచ్చిన రేటుకు భారీ వ్యత్యాసం ఉండటంపై ఈఎస్ఐ వర్గాల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరపాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి.

**ముందుగా రూ.13.65 సిఫార్సు**
ఈఎస్ఐ ఆస్పత్రుల్లో క్లీనింగ్ చేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీకి ప్రస్తుతం చెల్లిస్తున్న చదరపు అడుగు రూ.10 రేటు గిట్టుబాటు కావడం లేదని కాంట్రాక్టర్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. దీనిపై కార్మిక శాఖ జాయింట్ కమిషనర్ నేతృత్వంలో ఆరుగురు అధికారులతో కమిటీని ఏర్పాటు చేశారు. మార్కెట్ ధరలను పరిశీలించిన కమిటీ.. రేటును రూ.13.65కు పెంచవచ్చని సిఫార్సు చేసింది. అయితే రేటులో ఒక్క రూపాయి పెంపు చేయాలన్నా ప్రభుత్వ అనుమతి అవసరమని జిల్లా ఉపాధి కల్పనాధికారి ఈఎస్ఐ మెడికల్ సూపరింటెండెంట్‌కు లేఖ ద్వారా సూచించినట్లు కథనంలో పేర్కొన్నారు. అనంతరం ముగ్గురు మెడికల్ సూపరింటెండెంట్లతో మరో కమిటీని ఏర్పాటు చేయగా, ఆ కమిటీ రూ.19.50 వరకు పెంచవచ్చని సూచించినట్లు సమాచారం.

**సిఫార్సులు ఒక వైపు.. తుది రేటు మరో వైపు**
ఇక్కడే అసలు ప్రశ్న మొదలవుతోంది. కమిటీల సిఫార్సులు రూ.13.65, రూ.19.50 వద్ద ఉండగా.. అనంతరం రూ.25కు పెంచాలని ప్రతిపాదన వచ్చినట్లు సమాచారం. అయితే చివరకు అక్టోబర్ 15న జారీ చేసిన ఉత్తర్వులతో క్లీనింగ్ రేటును రూ.10 నుంచి ఏకంగా రూ.49.50కు పెంచినట్లు కథనం పేర్కొంది. దీంతో మధ్యలో జరిగిన నిర్ణయ ప్రక్రియపై స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**నాలుగు ఆస్పత్రులు.. ఒకే ఏజెన్సీ?**
నాచారం, రామచంద్రాపురం, వరంగల్, జీడిమెట్ల ఈఎస్ఐ ఆస్పత్రుల క్లీనింగ్ పనులను ఒకే ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీకి నామినేషన్ పద్ధతిలో అప్పగించారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. నాలుగు ఆస్పత్రుల్లో కలిపి సుమారు 6.17 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణం ఉన్నట్లు అధికారిక లెక్కలను ఉటంకిస్తూ కథనం పేర్కొంది. ఇంత పెద్ద మొత్తంలో పనులను ఒకే సంస్థకు అప్పగించడంపై పారదర్శకతకు సంబంధించిన ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**నెలకు రూ.2.44 కోట్ల అదనపు భారం?**
రేటు పెంపు ప్రభావం ప్రభుత్వ ఖజానాపైనా భారీగా పడే అవకాశం ఉంది. పాత రేటు ప్రకారం నాలుగు ఆస్పత్రుల క్లీనింగ్‌కు నెలకు సుమారు రూ.61.71 లక్షలు ఖర్చయ్యేదని, పెంచిన రేటుతో ఈ మొత్తం రూ.3.05 కోట్లకు చేరినట్లు కథనం పేర్కొంది. అంటే నెలకు దాదాపు రూ.2.44 కోట్ల అదనపు భారం పడే పరిస్థితి ఏర్పడింది. ఏడాది లెక్కన పాత వ్యయం రూ.7.40 కోట్ల నుంచి సుమారు రూ.36.66 కోట్లకు చేరుతుందని, వ్యత్యాసం దాదాపు రూ.29.25 కోట్లుగా ఉంటుందని అంచనా.

**విదేశీ పర్యటనలోనే బిల్లులపై ఆదేశాలా?**
ఇదే సమయంలో పెండింగ్ బిల్లుల చెల్లింపులపైనా వివాదం నెలకొంది. విదేశీ పర్యటనలో ఉన్న సదరు అధికారి అక్టోబర్ 23న సాయంత్రం 4 గంటల్లోగా పెండింగ్ బిల్లులన్నీ చెల్లించాలని, లేనిపక్షంలో శాఖాపరమైన చర్యలు ఉంటాయని కిందిస్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు కథనం పేర్కొంది. విదేశీ పర్యటన సమయంలో అధికారిక నిర్ణయాలు తీసుకునే విధానం, బాధ్యతలు ఎవరికి అప్పగించారు వంటి అంశాలపై స్పష్టత అవసరమన్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.

**సంబంధాలపై ఆరోపణలు.. విచారణతోనే స్పష్టత**
రేటు పెంపు వెనుక వ్యక్తిగత పరిచయాలు, గత సంబంధాలు ప్రభావం చూపాయన్న ఆరోపణలు కూడా కథనంలో ఉన్నాయి. సంబంధిత ఐఏఎస్ అధికారి గతంలో శిక్షణ పొందిన సంస్థ యాజమాన్యానికి చెందిన వ్యక్తులకు ఔట్‌సోర్సింగ్ సంస్థలు ఉన్నాయని, వారికి ఈఎస్ఐ కాంట్రాక్టులు ఉన్నాయని ఆరోపణలు వచ్చాయి. అయితే ఇవి ఆరోపణలే కావడంతో సంబంధిత అధికారులు, సంస్థల వివరణలు తీసుకోవడంతోపాటు స్వతంత్ర విచారణ ద్వారానే వాస్తవాలు తేలాల్సి ఉంటుంది. క్లీనింగ్ రేటు రూ.10 నుంచి రూ.49.50కు ఎందుకు పెంచాల్సి వచ్చింది? కమిటీలు సూచించిన మొత్తాల కంటే ఇంత భారీగా పెంపునకు ఆధారం ఏమిటి? నాలుగు ఆస్పత్రుల పనులను ఒకే ఏజెన్సీకి నామినేషన్‌పై అప్పగించాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చింది? పెరిగిన రేటుతో ప్రభుత్వంపై పడే అదనపు భారాన్ని అధికారులు ఎలా సమర్థిస్తున్నారు? వంటి ప్రశ్నలకు అధికారిక సమాధానాలు రావాల్సి ఉంది. ఈ అంశాలపై సమగ్ర విచారణ జరిగితేనే రేటు పెంపు వెనుక అసలు కారణాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

# అతనంటే నాకు పిచ్చి ఇష్టం



సౌత్ ఇండస్ట్రీలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న హీరోయిన్లలో ఐశ్వర్య రాజేశ్ ఒకరు. గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా, నటనకు ప్రాధాన్యత ఉన్న విభిన్నమైన కథలను ఎంచుకుంటూ ప్రేక్షకులకు దగ్గరవుతున్నారు. తెలుగు, తమిళ చిత్రాల్లో నటిస్తూ తనదైన ముద్ర వేస్తున్న ఈ అందాల భామ.. ఓ పాడ్‌కాస్ట్‌లో తన వ్యక్తిగత జీవితం, సినీ ప్రయాణానికి సంబంధించిన ఆసక్తికర విషయాలను పంచుకున్నారు.

ఐశ్వర్య రాజేశ్ మాట్లాడుతూ.. హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకోకముందు నుంచే సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ అంటే తనకు చాలా ఇష్టమని వెల్లడించారు. అతడిపై ఉన్న అభిమానాన్ని తన స్నేహితులతో కూడా పంచుకునేవారని తెలిపారు. సుశాంత్‌ను ప్రత్యక్షంగా చూడాలని, అతడితో కలిసి ఓ ఫొటో దిగాలని అప్పట్లో ఎంతో ఆశపడినట్లు చెప్పుకొచ్చారు. ఇప్పటికీ సుశాంత్ అంటే తనకు ఎంతో ఇష్టమని, అతడిపై ఉన్న క్రష్ అలాగే ఉందని పేర్కొన్నారు.ఐశ్వర్య రాజేశ్ మాట్లాడుతూ.. హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకోకముందు నుంచే సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ అంటే తనకు చాలా ఇష్టమని వెల్లడించారు. అతడిపై ఉన్న అభిమానాన్ని తన స్నేహితులతో కూడా పంచుకునేవారని తెలిపారు. సుశాంత్‌ను ప్రత్యక్షంగా చూడాలని, అతడితో కలిసి ఓ ఫొటో దిగాలని అప్పట్లో ఎంతో ఆశపడినట్లు చెప్పుకొచ్చారు. ఇప్పటికీ సుశాంత్ అంటే తనకు ఎంతో ఇష్టమని, అతడిపై ఉన్న క్రష్ అలాగే ఉందని పేర్కొన్నారు.ఓసారి గోవా ఫిల్మ్ ఫెస్టివల్‌కు వెళ్లినప్పుడు సుశాంత్ సింగ్ రాజ్‌పుత్‌ను ప్రత్యక్షంగా చూసే అవకాశం ఐశ్వర్యకు లభించిందట. అతడిని చూసి ఎంతో సంతోషించిన ఆమె.. ఎలాగైనా ఓ ఫొటో తీసుకోవాలని అనుకున్నారట. ఫిల్మ్ ఫెస్టివల్ అనంతరం జరిగే నైట్ పార్టీకి సుశాంత్ వస్తారని భావించి ఎదురుచూశారు. అయితే ఆయన ఆ పార్టీకి రాకపోవడంతో నిరాశ చెందారట.ఓసారి గోవా ఫిల్మ్ ఫెస్టివల్‌కు వెళ్లినప్పుడు సుశాంత్ సింగ్ రాజ్‌పుత్‌ను ప్రత్యక్షంగా చూసే అవకాశం ఐశ్వర్యకు లభించిందట. అతడిని చూసి ఎంతో




## ఫౌజీ అప్డేట్ వచ్చేసింది..

పాన్ ఇండియా రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా, టాలెంటెడ్ డైరెక్టర్ హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న మోస్ట్ ఎవైటెడ్ పీరియాడికల్ యాక్షన్ డ్రామా 'ఫౌజీ'. తాజాగా మేకర్స్ ఈ సినిమాకు సంబంధించిన అఫీషియల్ టైటిల్, గ్లింప్స్ , విడుదల తేదీని ప్రకటిస్తూ ఒక పవర్‌ఫుల్ వీడియోను విడుదల చేశారు. మైత్రీ మూవీ మేకర్స్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ గ్లింప్స్ ప్రస్తుతం సోషల్ మీడియాలో రికార్డులను సృష్టిస్తూ ట్రెండింగ్‌లో నిలిచింది. 'ఫైల్ నం. 25: ఫౌజీ' (ఖీఱశ్రీవ అశీ. 25 : ఖీూఖ్ఖ×) పేరుతో విడుదలైన ఈ గ్లింప్స్ వీడియో సినిమాపై అంచనాలను తారాస్థాయికి చేర్చింది. ఈ గ్లింప్స్‌లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ , అడాల్ఫ్ హిట్లర్ మధ్య జరిగే సంభాషణతో కథ ప్రారంభమవుతుంది. బ్రిటీష్ వారిని ఓడించడానికి జర్మనీ సహాయం కోరడానికి వెళ్లిన సుభాష్ చంద్రబోస్ తో హిట్లర్ మాట్లాడే సీన్ అత్యంత ఆసక్తికరంగా ఉంది. ఇండియన్ల రక్తంలో బానిసత్వం ఉందని, యుద్ధంలో గెలవడం కష్టమని హిట్లర్ అనగా.. ఇంటెలిజెన్స్ గురించి, బ్రిటిష్వారిని గడగడలాడించిన ఒకే ఒక్క సైనికుడి గురించి బోస్ వివరిస్తారు.బ్రిటీష్ వారి గుండెల్లో రైళ్లు పరిగెత్తించిన ఆ సైనికుడిని 'ఫౌజీ' అని పిలుస్తారని, భగవద్గీత ఆధారంగా అతడు సృష్టించిన కోడ్ ఎనిగ్మా కంటే ప్రమాదకరమని బోస్ చెప్పే డైలాగ్స్ గూస్‌బంప్స్ తెప్పిస్తాయి. చివరిలో ప్రభాస్ మాస్ ఎంట్రీ ఇచ్చి, బ్రిటీష్ అధికారులను హెచ్చరిస్తూ చెప్పే మాస్ డైలాగ్స్ సినిమాపై అంచనాలను స్కై-హైకి తీసుకెళ్లాయి.కేవలం గ్లింప్స్‌తోనే సినిమాపై భారీ హైప్ క్రియేట్ చేసిన చిత్రబృందం, ఈ మూవీ విడుదల తేదీని కూడా అధికారికంగా ప్రకటించింది. ఈ పాన్ ఇండియా బ్లాక్‌బస్టర్ సినిమాను 2027 మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్లు మేకర్స్ వెల్లడించారు. విశాల్ చంద్రశేఖర్ సంగీతం, విజువల్స్ హాలీవుడ్

## ఓటీటీలోకి కయాదు లోహర్ కొత్త సినిమా



టాలీవుడ్ ,కోలీవుడ్‌లో మ్యూజిక్ డైరెక్టర్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవడంతో పాటు, హీరోగానూ వరుస వైవిధ్యమైన చిత్రాలతో దూసుకుపోతున్నారు జీవీ ప్రకాశ్ కుమార్. ఆయన ప్రధాన పాత్రలో నటించిన తాజా ఫాంటసీ హారర్ థ్రిల్లర్ మూవీ 'ఇమ్మోర్టల్'. 'నాకు మరణం లేదు' అనేది ఈ చిత్రానికి ఉపశీర్షిక. మారియప్పన్ చిన్న దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా థియేటర్లలో విడుదలై ప్రేక్షకుల నుంచి మంచి రెస్పాన్స్ సొంతం చేసుకుంది. తాజాగా ఈ మూవీకి సంబంధించిన డిజిటల్ స్ట్రీమింగ్ అప్‌డేట్ అధికారికంగా బయటికి వచ్చింది. థియేటర్లలో ప్రేక్షకులను భయపెడుతూనే మరోవైపు రొమాంటిక్ అండ్ థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో ఆకట్టుకున్న 'ఇమ్మోర్టల్' సినిమా త్వరలోనే ఓటీటీ ప్రియులను అలరించడానికి సిద్ధమైంది.ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫాం సోనీ లివ్ వేదికగా ఈ చిత్రం అక్టోబర్ 30 నుంచి డిజిటల్ స్ట్రీమింగ్‌కు రానుంది. తమిళంతో పాటు తెలుగు, హిందీ, కన్నడ, మలయాళం భాషల్లో ఏకకాలంలో ఈ మూవీ అందుబాటులోకి రానుండటంతో హారర్ జోనర్ ఇష్టపడే సినీ ప్రియులు ఓటీటీలో చూసేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇందులో కయాదు లోహర్ కథానాయికగా నటించింది.మహి (జీవీ ప్రకాశ్) అనే సాధారణ యువకుడు తన ఉద్యోగ రీత్యా తక్కువ అద్దెలో ఇల్లు వెతుకుతూ ఉంటాడు. ఆ సమయంలో సింధు (కయాదు లోహర్) అనే యువతితో పరిచయం ఏర్పడుతుంది. ఆమె ఉంటున్న అపార్ట్‌మెంట్‌లోనే షేరింగ్ ఫ్లాట్‌లో మహి అద్దెకు దిగుతాడు. తొలిచూపులోనే సింధుతో ప్రేమలో పడిన మహి జీవితంలో కొన్ని ఊహించని వింత సంఘటనలు చోటుచేసుకుంటాయి. అసలు సింధు ఎవరు? ఆమె వెనుక ఉన్న వెయ్యేళ్ల నాటి జానపద మిస్టరీ ఏంటి? ఆ అపార్ట్‌మెంట్‌లోని భయానక రహస్యాల నుంచి మహి ఎలా బయటపడ్డాడు? అనేదే ఈ చిత్ర ప్రధాన కథాంశం.



## ఎట్టకేలకు కోలీవుడ్ కల నెరవేర్చనున్న రజనీకాంత్..

ఆల్‌టైమ్ రికార్డ్ వసూళ్ల దిశగా 'జైలర్ 2' భారీ బడ్జెట్ సినిమాలు వెయ్యి కోట్ల మార్కును చేరుకోవడం ఇప్పుడు సర్వసాధారణమైపోయింది. పెద్ద స్టార్ నటుల కొన్ని యావరేజ్ సినిమాలు కూడా కేవలం నెల రోజుల్లోనే వెయ్యి కోట్లు వసూలు చేశాయి. అనేక బాలీవుడ్, తెలుగు సినిమాలు ఇప్పటికే వెయ్యి కోట్ల క్లబ్ లో చేరాయి. కేజీఎఫ్, కంతర వంటి కన్నడ చిత్రాలు కూడా వెయ్యి కోట్ల మార్కును దాటాయి. కానీ రజనీకాంత్ , కమల్ హాసన్, విజయ్, అజిత్, సూర్య వంటి స్టార్ నటులు ఉన్న తమిళ చిత్ర పరిశ్రమ మాత్రమే ఈ ఘనతను సాధించలేకపోయింది. బాక్సాఫీస్ వద్ద రూ. 1000 కోట్లు దాటిన ఒక్క తమిళ సినిమా కూడా లేదు. భారతదేశంలోని అతిపెద్ద చిత్ర పరిశ్రమలలో ఒకటి అయినప్పటికీ, ఆ ఇండస్ట్రీ నుంచి ఒక్క సినిమా కూడా 1000 కోట్లు సంపాదించలేకపోయింది. వెయ్యి కోట్లు సంపాదించే సినిమాను ఇవ్వాలన్నది తమిళ చిత్ర నటులు, దర్శకుల కల. ఇప్పుడు ఆ కలను నెరవేర్చే బాధ్యత సూపర్‌స్టార్ రజనీకాంత్ 'జైలర్ 2'పై ఉంది. 'జైలర్ 2' విడుదలై వారం రోజులు కాగా, ఇప్పటివరకు సుమారు రూ. 600 కోట్లకు పైగానే వసూలు చేసింది. తద్వారా ఒక వారంలో ఇంత భారీ మొత్తాన్ని వసూలు చేసిన మొదటి తమిళ చిత్రంగా రికార్డుల కెక్కింది. ఈ చిత్రం ఓటీటీకి రాకముందే, అంటే రాబోయే రెండు మూడు వారాల్లో మిగిలిన నాలుగు వందల కోట్లను సంపాదించే బలమైన అవకాశం ఉందని బాక్సాఫీస్ పండితులు విశ్లేషించారు. దీంతో, 'జైలర్ 2' 1000 కోట్లు వసూలు చేసిన తొలి తమిళ చిత్రంగా నిలిచే అవకాశం ఉంది.2023లో రిలీజైన జైలర్ సినిమాకు సీక్వెల్ గా జైలర్ 2 తెరకెక్కింది. ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా సుమారు ?600--650 కోట్లు వసూలు చేసింది. దీని కారణంగా, రెండవ భాగంపై అంచనాలు ఆకాశాన్ని అంటాయి. అందుకు తగ్గట్టుగానే ఈ క్రేజీ సీక్వెల్ బాక్సాఫీస్ రికార్డులను బద్దలు కొట్టేస్తోంది. సన్ పిక్చర్స్ నిర్మించిన ఈ చిత్రం బడ్జెట్ సుమారు రూ. 300 కోట్ల వరకు ఉంటుందని అంచనా. ఎప్పటిలాగే రిటైర్డ్ జైలర్ ముత్తువేల్ పాండియన్ పాత్రలో రజనీకాంత్ యాక్షన్, స్టైల్, స్వాగ్ అభిమానులకు తెగ నచ్చేశాయి.



## హౌస్ నెం. 47' ట్రైలర్ వచ్చేసింది.

విక్టరీ వెంకటేష్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కలయికలో రూపొందుతోన్న ప్రతిష్టాత్మక చిత్రం 'ఆదర్శ కుటుంబం -- హౌస్ నెం. 47'. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్. రాధాకృష్ణ (చినబాబు) నిర్మిస్తున్న ఈ చిత్రంపై అంచనాలు భారీగా ఉన్నాయి. ఇప్పటికే విడుదలైన టీజర్, నారాయణమ్మ, మాలా పాటలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఇక ఇప్పుడు ఈ సినిమా నుంచి అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ట్రైలర్ విడుదలైంది. గిలిగింతలు పెట్టే హాస్య సన్నివేశాలు, ఉత్కంఠభరితమైన యాక్షన్, ఆసక్తికరమైన డ్రామాతో ఈ సినిమా ఒక సంపూర్ణ వినోదాత్మక చిత్రంగా నిలుస్తుందనే నమ్మకాన్ని 'ఆదర్శ కుటుంబం' ట్రైలర్ కలిగిస్తోంది. త్రివిక్రమ్ రచన, దర్శకత్వంలో రూపొందుతోన్న ఈ సినిమా ట్రైలర్.. ఆయన బలమైన రచనను, విలక్షణమైన కథా శైలిని మరోసారి చూపిస్తోంది. కుటుంబ వినోదానికి యాక్షన్ థ్రిల్లర్ అంశాలను జోడిస్తూ ఆసక్తిని పెంచుతోంది. కామెడీ, యాక్షన్, సస్పెన్స్‌లను చక్కగా మేళవించిన ట్రైలర్.. అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా సినిమా ఉండబోతోందనే అంచనాలను పెంచుతోంది. విక్టరీ వెంకటేష్ తనదైన కామెడీ టైమింగ్, ఆకట్టుకునే స్క్రీన్ ప్రెజెన్స్‌తో ట్రైలర్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. యాక్షన్ సన్నివేశాల్లోనూ ఆయన చూపించిన ఎనర్జీ సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతోంది. ఆయన నటనకు తోడు ఆసక్తికరమైన కథనం, వినోదభరిత సన్నివేశాలు ట్రైలర్‌ను మరింత ఆకట్టుకునేలా చేశాయి. ఇక తమన్ అందించిన నేపథ్య సంగీతం ట్రైలర్‌కు అదనపు బలాన్నిచ్చింది. ముఖ్యంగా యాక్షన్ సన్నివేశాల్లో తీవ్రతను పెంచుతూ, కథలోని ఉత్కంఠను మరింతగా ఎలివేట్ చేసింది.'ఆదర్శ కుటుంబం' ట్రైలర్ ఆవిష్కరణ వేడుక హైదరాబాద్ లోని మల్లారెడ్డి విశ్వ విద్యాపీఠ్ కళాశాలలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో విక్టరీ వెంకటేష్ మాట్లాడుతూ.. "మల్లారెడ్డి విశ్వ విద్యాపీఠ్ లో ఈ వేడుక జరుపుకోవడం సంతోషంగా ఉంది. ట్రైలర్ మీ అందరికీ నచ్చిందని ఆశిస్తున్నాను. మీ అద్భుతమైన స్పందన చూసి ఆనందంగా ఉంది. కాలేజ్ లైఫ్ లో నాకు ఎన్నో మెమోరీస్ ఉన్నాయి. ఈరోజులు మళ్ళీ రావు. మీరు కూడా మంచి మెమోరీస్ ఉండేలా చూసుకోండి. మీ కలను నిజం చేసుకోండి. కాలేజ్ అంటే డిగ్రీ, జాబ్ మాత్రమే కాదు.. మంచి క్యారెక్టర్ తో బయటకు రావాలి. అక్టోబర్ 30న మా సినిమా విడుదలవుతోంది. మీ అందరూ సినిమా చూసి ఎంజాయ్ చేస్తారని కోరుకుంటున్నాను." అన్నారు.మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. "ఈ సినిమా మీరు ఊహించిన పద్ధతిలో కాకుండా, వేరే డైరెక్షన్ లో ఉండే లాంటి అవకాశమున్న సినిమా ఇది. నార్మల్ రొమాంటిక్ కామెడీ కాకుండా వేరే వేరే అంశాలను కూడా డిస్కస్ చేయడం జరిగింది. క్రైమ్ కామెడీ లేదా బ్లాక్ కామెడీ అలాంటివి ట్రై చేశాము. నాకు, వెంకటేష్ గారికి కూడా ఇది ఫస్ట్ అటెంప్ట్. పని చేసేటప్పుడు ఈ సినిమా మా అందరికీ ఇంట్రెస్టింగ్ గా అనిపించింది. మీక్కూడా నచ్చుతుందని ఆశిస్తున్నాను. అక్టోబర్ 30వ తారీఖున థియేటర్లలో కలుద్దాం. ఈ సినిమాలో పనిచేసిన అందరు టెక్నీషియన్లకు, నటీనటులకు, ముఖ్యంగా వెంకటేష్ గారికి కృతజ్ఞతలు. ప్రొడ్యూసర్ చినబాబు గారికి థ్యాంక్స్ చెప్పుకోవడమంటే ఫ్యామిలీకి థ్యాంక్స్ చెప్పుకోవడమే. ఆయన తరపున కూడా అందరికీ నేనే కృతజ్ఞతలు చెబుతున్నాను. అలాగే తమన్ అద్భుతమైన సంగీతం అందించాడు. ముఖ్యంగా బ్యాక్ గ్రౌండ్ స్కోర్ ఫెంటాస్టిక్ జాబ్ చేశాడు. దాదాపు 7-8 పాటలు బ్యాక్ గ్రౌండ్ స్కోర్ లో ఉంటాయి. త్వరలోనే రిలీజ్ చేయబోతున్నాం అవన్నీ.

## హైకూ మనల్ని ఎగ్జైట్ చేసే సిన్సియర్ లవ్ స్టోరి.



ఏగన్, కోర్ట్ ఫేమ్ శ్రీదేవి, ఫెమినా జార్జ్ హీరో హీరోయిన్లుగా విజన్ సినిమా హౌస్ బ్యానర్‌పై రూపొందుతోన్న రొమాంటిక్ ఎంటర్‌టైనర్ 'హైకూ'.యువరాజ్ చిన్నసామి రచన, దర్శకత్వంలో డా. డి. అరుళానందు, మాథ్యూ అరుళానందు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అక్టోబర్ 23న మూవీ రిలీజ్ అవుతోంది. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన రిలీజ్ ప్రెస్‌మీట్‌కు ప్రముఖ రచయిత, నిర్మాత కోన వెంకట్, డైరెక్టర్ రామ్ జగదీశ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హీరోయిన్ శ్రీదేవి మాట్లాడుతూ.. "ఈ సినిమా నా హార్ట్ కి చాలా బాగా కనెక్ట్ అయింది. ఈ సినిమా కథ వినగానే బాగా నచ్చి వెంటనే ఓకే చేశా. లవ్ లో ఉన్నా, రిలేషన్ షిప్ లో ఉన్నా, మ్యారీడ్ కపుల్ అందరికీ ఈ సినిమా నచ్చుతుంది. లవ్ ఉన్న కాంప్లికేషన్స్ మొత్తం ఈ సినిమాలో చూస్తారు. ఏగన్ డౌన్ తో ఎర్త్. ఆయనతో కలిసి పని చేయడం హ్యాప్పీగా అనిపించింది. నన్ను చాలా కూల్ గా హ్యాండిల్ చేసిన డైరెక్టర్ గారికి చాలా థ్యాంక్స్. మా టీం మొత్తం కూడా ఎంతో సహకరిస్తూ పని చేశారు. ఇది నా ఫస్ట్ డెబ్యూ. మీరంతా అక్టోబర్ 23 న థియేటర్ లో ఎంజాయ్ చేయండి"" అన్నారు.హీరో ఏగన్ మాట్లాడుతూ.. "నేను ఇండస్ట్రీకి కొత్త. హైకూ సినిమా క్లోజ్ తో మై హార్ట్. బాగా కష్టపడి సినిమా చేశాము. ఈ సినిమాపై నేను చాలా కాన్ఫిడెంట్ గా ఉన్నాను. మ్యూజిక్ డైరెక్టర్ సిద్దు కుమార్

Printed, published &owned. By ravula rajesham printed at. JORDAR publication H.NO.2-5_146 . jammikunta.dist. karimnagar Telangana state 505122..editor.ravula rajesham, email. editor jordar@gmail.com. cellphone 7780185674 PRGi numberTG TEL/25/A5224